ANN తెలుగు

Follow: @ANNTELUGU

01-07-2026

# మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 167 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సీఎస్ గా కొలువుదీరిన సంజయ్ జాజు

- అంతకు ముందు సీఎం రేవంత్ తో భేటీ
- పదవీ విరమణ చేసిన రామకృష్ణారావు
- ఇరువురినీ అభినందిన స్పెషల్ సీఎస్‌లు, పలువురు ఉన్నతాధికారులు

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు మంగళవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు. పదవీ బాధ్యతలను స్వీకరించేకంటే ముందు సంజయ్ జాజు హెచ్ ఆర్ డీలో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. హెచ్‌ఆర్ డీ నుంచి నేరుగా సచివాలయానికి వచ్చిన జాజు సీఎస్ గా బాధ్యతలను స్వీకరించారు.

టాప్ న్యూస్



### ట్రంప్‌కు సుప్రీంకోర్టు షాక్

- భారతీయులకు ఊరట
- బర్త్‌రైట్ పౌరసత్వానికి సుప్రీంకోర్టు మద్దతు


03



### రేపు తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహణ
- వివిధ శాఖల అజెండాపై చర్చకు అవకాశం

03




### బండికి ఊరట

- నాంపల్లి కోర్టులో కేసు కొట్టివేత
- సుమోటో కేసులో విముక్తి పొందిన కేంద్ర మంత్రి

02

# ఉప ప్రధానిగా అమిత్ షా?

## మంత్రివర్గ విస్తరణలో ప్రమోషన్?
## అత్యంత సుదీర్ఘకాలం హోంమంత్రిగా 'అద్వానీ' రికార్డు బ్రేక్
## జాతీయ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు



**ఢిల్లీ, మహా :** దేశ రాజధాని వేదికగా జాతీయ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఒక సరి కొత్త పరిణామం తెరపైకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గంలో త్వరలో జరగబోయే పునర్వ్యవస్థీకరణలో.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాత్మక పాత్ర మరింత విస్తృతం కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. గతంలో బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ అలంకరించిన అత్యున్నత 'ఉప ప్రధాని' పీఠంపై అమిత్ షాను కూర్చోబెట్టే దిశగా ప్రధాని మోదీతో పాటు బిజెపి హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తోందని రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు వీలుగా అమిత్ షాకు ప్రమోషన్ ఇవ్వడం అనివార్యమని, ఇది సరైన సమయమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీకి 75 ఏండ్లు పూర్తికాగా, ఉత్తరప్రదేశ్ లో వచ్చే ఏడాది యోగీ మూడోసారి అధికారంలోకి తీసుకొస్తే ఢిల్లీపీఠానికి రేసులోకి రావచ్చన్న ప్రచారాలున్నాయి. ఈ క్రమంలో ఇపుడు సరైన సమయంగా ఆలోచనలు సాగుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రస్తుతం బిజెపి సంస్థాగత ప్రధానకార్యదర్శిగా ఉన్న బిఎల్ సంతోష్ స్థానంలో సునిల్ బన్సాల్ వచ్చే అవకాశముందని వినబడుతోంది. కీలకస్థానాల్లో.. రాజకీయ, అధికారిక మార్పులకు మోదీ

మిగతా 3వ పేజీలో



### రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదు

- రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండాలి కానీ శత్రువులుగా కాదు
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- టి.డి. జనార్ధన్‌కు రసం రసమయి- ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం

02



### మాకు పాకిస్థాన్ అవసరం లేదు

- పీవోకే హెచ్చరిక
- 22 రోజులుగా ఆందోళనలు

02

జైనథ్ మండలం లక్ష్మిపూర్‌లో ..

### మొలకెత్తని సోయా విత్తనాలు

**కలెక్టర్ కు ఫిర్యాదుచేసిన రైతులు**

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం లక్ష్మిపూర్‌లో సోయా విత్తనాలు మొలకెత్తలేదు. దాదాపు 405 ఎకరాల్లో విత్తనాలు మొలకెత్తలేదని, రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు మళ్లీ విత్తనాలు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఇదే సమయంలో విత్తన నాణ్యత పరిశీలన కోసం కలెక్టర్ కమిటీలను ఏర్పాటు చేశారు. వ్యవసాయం శాస్త్ర వేత్తలు, అధికారులు క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలిస్తున్నారు.



బకాయిలు పెట్టింది బకాసురుడు

## కట్టే పాపం మాకా?

### అరుంధతిలో పశుపతిలా.. ఫామ్ హౌజ్ లో కేసీఆర్
### కేసీఆర్ మళ్లీ వస్తే చేసేదేమీ ఉండదు
### రైతుభరోసా విడుదల కార్యక్రమంలో రేవంత్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మహా :** గత పదేళ్లలో దాదాపు రూ.7 లక్షల కోట్ల అప్పు చేసి ధనిక రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. కల్వకుంట్ల కుటుంబం చేసిన అప్పులు, తప్పుల భారం ఇప్పుడు తమ ప్రభుత్వం భరిస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. 'బకాయిలు పెట్టింది బకాసురుడు... కట్టే పాపం మాకా?' అంటూ విమర్శించారు. రైతు భరోసా నిధులను విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి విడతలో రెండు ఎకరాల లోపు భూమి కలిగిన 41.37 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,482 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. రైతుల పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ పేర్కొన్నారు. 30 నెలల ప్రజాపాలనలో రైతు తలెత్తుకునేలా పాలన అందిస్తున్నామని అన్నారు. వ్యవసాయం దండగ కాదని, పండుగగా భావించే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడే సమయానికి రాష్ట్ర అప్పు రూ.69 వేల కోట్లు ఉండగా, 2023 నాటికి అది రూ.8.11 లక్షల కోట్లకు చేరిందని అన్నారు.

గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులకు వాయిదాల పద్ధతిలో జీతాలు చెల్లించే పరిస్థితి నెలకొందని, ధనిక రాష్ట్రాన్ని ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకెళ్లారని విమర్శించారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు తెలంగాణ పరువు తీశారని విమర్శించారు. ప్రస్తుతం ప్రజా పాలనలో ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రైతు భరోసా పథకం కింద రూ.36 వేల కోట్లు రైతులకు అందించినట్లు సీఎం వెల్లడించారు.

కేసీఆర్ అప్పులపాలు చేశారు ఉమ్మడి రాష్ట్రాన్ని 19 మంది ముఖ్యమంత్రులు పాలించారని, వారు చేసిన అప్పు రూ.60 వేల కోట్లు

మిగతా 3వ పేజీలో



### నేటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్

- బిజెపి నాయకత్వానికి తెలంగాణ ప్రత్యేక మిషన్
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్
- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కీలక ప్రసంగం చేసిన జాతీయ అధ్యక్షుడు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలు కుమ్మక్కు రాజకీయాలు

02

### ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

హైదరాబాద్ నుంచే ప్రపంచ విమానయాన భవిష్యత్‌కు దిశానిర్దేశం

- గ్లోబల్ ఏరోస్పేస్ దిగ్గజాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానం
- వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల పనులు త్వరలో ప్రారంభం...
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో గ్రీన్ సిగ్నల్

02



### రైతుల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

03

### మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై ఏఐ మార్ఫింగ్ వీడియోలు

- సైబర్ నేరస్థులపై పోలీసులకు ఫిర్యాదు
- మంత్రి తరపున ఫిర్యాదు చేసిన లాయర్ శశిభూషణ్

03

### వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

- కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రసంగం
- పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం
- ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన
- గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి

02







# వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

**విశాఖపట్టణం, మహా** : వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు.

గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ విశ్వవిద్యాలయం గిరిజన యువత సర్వతోముఖాభివృద్ధికే కాకుండా, ఈ ప్రాంత సమగ్ర వికాసానికి కూడా గణనీయమైన కృషి చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

ప్రియమైన విద్యార్థులారా, ఈ స్నాతకోత్సవం మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది సంతోషించుకునే రోజే అయినా, భవిష్యత్తుపై సంకల్పం తీసుకోవడానికి కూడా ప్రేరణనిస్తుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే యువత నూతన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు, మీ పరిసరాల నుంచి నేర్చుకుంటూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. తమ సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం కొనసాగిస్తూనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు.

అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, చిరుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఎకోటూరిజం, స్థానిక నైపుణ్యాలను ప్రోత్సహించేలా గిరిజన విశ్వవిద్యాలయాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఉత్తరాంధ్ర గిరిజన తెగల సాధికారత కోసం ఈ వర్సిటీ 'సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్'ను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన పరిరక్షణ వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమ సమాజంతో కూడిన వికసిత భారత్ నిర్మాణంలో ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

# బండికి ఊరట



**హైదరాబాద్, మహా** :హుజూరాబాద్ అసెంబ్లీ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఓ పాత కేసులో కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్‌కు పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసును సుదీర్ఘంగా విచారించిన హైదరాబాద్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం.. బండి సంజయ్‌పై ఉన్న కేసును కొట్టివేస్తూ మంగళవారం కీలక తీర్పు వెలువరించింది హుజూరాబాద్ ఉప ఎన్నికల ప్రచార పర్వంలో.. అప్పటి అధికారపక్షమైన బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉప ఎన్నికల్లో గెలిచేందుకు బీఆర్ఎస్ నాయకత్వం ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంపిణీ చేస్తోందని ఆయన బహిరంగంగా ఆరోపించారు. అందులో భాగంగా ఓటర్లకు కేవలం రూ.5 వేల చొప్పున మాత్రమే చేరవేసి, మిగిలిన భారీ మొత్తాన్ని ఆ పార్టీ కార్యకర్తలే సొంతంగా పంచుకుంటున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపాయి. బండి సంజయ్ చేసిన ఈ సంచలన వ్యాఖ్యలను అప్పట్లో తీవ్రంగా పరిగణించిన హుజూరాబాద్ పోలీసులు ఆయనపై సుమోటోగా కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్లు 188 (ప్రభుత్వ ఉత్తర్వుల ఉల్లంఘన), 171సీ (ఎన్నికల్లో అక్రమ ప్రభావం చూపడం), 505(2) (విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం)తో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 123(3ఏ) కింద ఆయనపై వివిధ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు ఈ ఆరోపణలపై ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం.. బండి సంజయ్‌పై నమోదైన ఈ కేసును పూర్తిగా కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది.



# రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలు సరికాదు

**హైదరాబాద్, మహా** : తెలుగు వారందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలన్నది అందరి ఆకాంక్ష కావాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. మంగళవారం హైదరాబాద్ లోని త్యాగరాయ గాన సభలో దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 104 వ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు టి.డి. జనార్ధన్ కు ఎన్టీఆర్ పురస్కారాన్ని అందజేసిన కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. రసమయి సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకయ్య నాయుడు మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పడిపోతున్నాయని, ప్రత్యర్థి పార్టీల వారిని శత్రువులుగా చూస్తూ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఇది సరికాదన్నారు. రాజకీయాల్లో అవతల వారిని ప్రత్యర్థిగా భావించాలి కానీ, శత్రుత్వ భావన సరికాదన్నారు. పాలనాపరంగా రెండు రాష్ట్రాలుగా విడిపోవడం మంచిదేనని, అయితే తెలుగువారిగా సోదర భావంతో కలసి మెలసి మెలగాలన్నది అందరి ఆకాంక్ష కావాలన్నారు. అనవసర కలహాలు, అనవసర వివాదాలకు దూరంగా ఉండాలన్నారు. నందమూరి తారకరామారావు గొప్ప పరిపాలన దక్షుడని, సంస్కరణ అభిలాషి అని, రాజకీయాల్లో సంస్కరణలను అమలులోకి తెచ్చిన గొప్ప నేత అని చెప్పారు. ఆడపిల్లలకు ఆస్తిలో హక్కు కల్పించడంతోపాటు వారికి ఒక అన్నగా నిత్యం అండగా ఉండే వారన్నారు. వెనకబడిన వర్గాల వారికి రాజకీయ అవకాశాలు కల్పించి, వారు ఎదగడానికి అండదండలు అందించిన గొప్ప నాయకుడన్నారు. ఆయన నిత్యం ప్రజల గురించే ఆలోచించే వారిని ప్రజల జీవితాల్లో మెరుగు తీసుకురావాలని ఎప్పుడూ తపించేవారని చెప్పారు. నందమూరి తారక రామారావు ప్రాంతీయ పార్టీ అధినేతగా ఉన్నప్పటికీ ఆయన గొప్ప జాతీయవాది అని, ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలన్నారు. టి. డి జనార్ధన్ తొలినుంచి ఒకటే సిద్ధాంతానికి కట్టుబడి, అంకిత భావంతో క్రమశిక్షణతో పనిచేసిన వ్యక్తి అని, రాజకీయాల్లో ఇటువంటి వారు రావలసిన అవసరం ఉందని,యువతరం ఇటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఇంట్లో తప్పనిసరిగా తెలుగులోనే మాట్లాడాలని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేసుకోవాలని ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు సూచించారు. 59 ఏళ్లుగా ఎన్నో ఉత్కృష్టమైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఎన్టీఆర్ పై ఉన్న ప్రేమతో ఏటా ఈ పురస్కారాన్ని రసమయి సంస్థ అందిస్తోందని గుర్తు చేస్తూ సంస్థ అధ్యక్షులు రామును, నిర్వహణ బృందాన్ని అభినందించారు కార్యక్రమంలో హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఏరోస్పేస్ రాజధానిగా తెలంగాణ

**హైదరాబాద్, మహా** : ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు తెలంగాణ కొత్త కేంద్రంగా అవతరిస్తోందని, ఇకపై అత్యాధునిక విమానాలు, యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ వ్యవస్థల తయారీలో హైదరాబాద్ ప్రపంచ పటంలో అగ్రస్థానంలో నిలవబోతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో జరిగిన ఏరోమార్ట్ హైదరాబాద్-2026 అంతర్జాతీయ ఏరోస్పేస్ & డిఫెన్స్ బిజినెస్ కన్వెన్షన్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ, ప్రపంచ ఏరోస్పేస్ రంగం ఇప్పుడు తెలంగాణ వైపు చూస్తోందన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, అత్యాధునిక సాంకేతికతకు తెలంగాణే కొత్త చిరునామా అని స్పష్టం చేశారు. భారత వైమానిక దళంలో ఫైటర్ పైలట్‌గా పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ, సూపర్‌సోనిక్ యుద్ధ విమానాలను నడిపిన వ్యక్తిగా ఏరోస్పేస్ రంగంలో నాణ్యత, ఖచ్చితత్వం ఎంత కీలకమో తనకు ప్రత్యక్ష అనుభవం ఉందన్నారు. ఒక్క చిన్న విడిభాగం లోపం కూడా మిషన్ విజయాన్ని ప్రభావితం చేస్తుంది. అలాంటి అత్యున్నత ప్రమాణాలను తెలంగాణ పరిశ్రమలు నేడు విజయవంతంగా అందిస్తున్నాయని చెప్పారు.



అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్‌కు అవసరమైన క్యాబిన్లు, అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్మాణ భాగాలు, ఎఫ్-16 యుద్ధ విమానాల రెక్కలు, ప్రపంచ ప్రఖ్యాత ఏరో ఇంజిన్ విడిభాగాలు, ఎంఆర్ఓ వ్యవస్థలు నేడు తెలంగాణలోనే తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. "'మేడ్ ఇన్ తెలంగాణ' అనే ముద్ర ఇప్పుడు ప్రపంచ ఆకాశంలో గర్వంగా ఎగురుతోంది" అని పేర్కొన్నారు. స్పెయిన్‌కు చెందిన ఐటీపీ ఎయిరో, కెనడాకు చెందిన ఎఫ్ టీజీ ఎయిరో స్పేస్ వంటి అంతర్జాతీయ దిగ్గజాలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్ర పారిశ్రామిక విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ఫ్రాన్స్, ఇటలీ సహా 25కిపైగా దేశాల కంపెనీలు ఏరోమార్ట్‌లో పాల్గొనడం తెలంగాణ అంతర్జాతీయ ప్రాధాన్యతను మరింత పెంచిందని తెలిపారు. తెలంగాణలో ఇప్పటికే 1,500కు పైగా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సేవలందిస్తున్న ఎంఎస్ఎంఈలు పనిచేస్తున్నాయని, పరిశ్రమలకు అవసరమైన అత్యాధునిక పారిశ్రామిక పార్కులు, ప్రత్యేక ఆర్థిక మండలాలు, ప్లగ్అండ్‌ప్లే మౌలిక సదుపాయాలు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మార్చాయని చెప్పారు. డీఆర్‌డీఓ, రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రైవేట్ పరిశ్రమలు ఒకే నగరంలో ఉండటం హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యాన్ని కల్పించిందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మారుతున్న ఐటీఐలు ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యంతో కూడిన యువతను తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగం గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేయగా, గత ఏడాది ఎగుమతులు 103 శాతం పెరిగి, రాష్ట్రానికి ఎన్నో దశాబ్దాలుగా అగ్రగామిగా ఉన్న ఔషధ రంగాన్నే అధిగమించడం తెలంగాణ పారిశ్రామిక చరిత్రలో ఒక స్వర్ణ అధ్యాయమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానయాన రంగ విస్తరణకు చారిత్రక నిర్ణయాలు తీసుకుందని మంత్రి వెల్లడించారు. వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన, ఆదిలాబాద్‌లో పౌరసైనిక అవసరాలకు అనువైన ఎయిర్‌ఫీల్డ్, కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో కేంద్ర ఆమోదం లభించనున్నాయని తెలిపారు. ఈ మూడు కేంద్రాలు భవిష్యత్తులో విమాన మరమ్మత్తు, విమాన తయారీ, రక్షణ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరవనున్నాయని చెప్పారు.

ప్రపంచ ఏరోస్పేస్ దిగ్గజాలను ఉద్దేశించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, "మీ తదుపరి తయారీ కేంద్రం తెలంగాణ కావాలి. మీ తదుపరి పెట్టుబడి హైదరాబాద్‌లో ఉండాలి. తెలంగాణ ప్రభుత్వం మీకు అనుమతులు ఇచ్చే ప్రభుత్వం మాత్రమే కాదు... మీ విజయానికి భాగస్వామిగా నిలిచే ప్రభుత్వం" అని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధుల నుంచి అధికార యంత్రాంగం వరకు పెట్టుబడిదారులకు 24 గంటలూ అందుబాటులో ఉంటామని, పరిశ్రమల స్థాపన, విస్తరణలో ప్రతి అడుగులోనూ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. "ఏరోమార్ట్ హైదరాబాద్-2026 కేవలం ఒక పారిశ్రామిక సదస్సు కాదు... ప్రపంచ ఏరోస్పేస్ పటంలో తెలంగాణ శాశ్వత స్థానాన్ని ఖరారు చేసే చారిత్రక వేదిక" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ఉప ప్రధానిగా అమిత్ షా?

( మొదటి పేజీ తరువాయి )

చాలాకాలంగా కసరత్తు నిర్వహిస్తున్నారు. జూలైలో దీనిపై స్పష్టత వస్తుందని జాతీయ రాజకీయవర్గాలు అంచనావేస్తున్నాయి.

**చరిత్ర సృష్టించిన 'చాణక్యుడు**

2019 మే 30న దేశ సార్వభౌమాధికారానికి గుండెకాయ లాంటి హోంశాఖ బాధ్యతలను తొలిసారిగా స్వీకరించిన అమిత్ షా, తన అప్రతిహత ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని అధిగమించారు. 2025 ఆగస్టు నాటికి హోంమంత్రిగా ఎల్.కె. అద్వానీ పేరిట ఉన్న 2,256 రోజుల రికార్డును ఆయన తిరగరాశారు. భారత రాజకీయ చరిత్రలోనే అత్యంత సుదీర్ఘకాలం పాటు హోంమంత్రిత్వ శాఖను విజయవంతంగా నిర్వహించిన అజేయ నేతగా అమిత్ షా సరికొత్త రికార్డు సృష్టించారు. 2029 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ నూతన ఉత్తేజాన్ని, యువ రక్తాన్ని నింపేందుకు బీజేపీ అధిష్ఠానం వ్యూహాలు రచిస్తోంది. అయితే, అమిత్ షా సాధించిన అసాధారణ పరిపాలనా విజయాలు, తిరుగులేని రాజకీయ వ్యూహాల నేపథ్యంలో ఆయన ప్రాధాన్యతను మరింత పెంచడమే శ్రేయస్కరమని మోదీషా ద్వయం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**ఏడేళ్ల ప్రస్థానం.. చారిత్రాత్మక నిర్ణయాలు**

తన ఏడేళ్ల హోంమంత్రిత్వ కాలంలో దేశ అంతర్గత భద్రతను ఉక్కుపిడికిలితో పటిష్టం చేసిన అమిత్ షా, భారత భూభాగంపై చెరపలేని ముద్ర వేశారు. ఆయన కెరీర్‌లో మైలురాళ్లుగా నిలిచిన కొన్ని కీలక ఘట్టాలు:

ఆర్టికల్ 370 రద్దు: 2019లో జమ్మూ కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని (ఆర్టికల్ 370, 35ఏ) రద్దు చేసి, కాశ్మీర్‌ను భారతదేశంలో అంతర్భాగంగా సంపూర్ణంగా విలీనం చేశారు.



పౌరసత్వ చట్టం (సీఏఏ): వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపజేసి, చట్టరూపం దాల్చేలా చేశారు.

సమూల న్యాయ సంస్కరణలు: బ్రిటీష్ కాలం నాటి పురాతన చట్టాల స్థానంలో 2023లో సరికొత్త భారతీయ న్యాయ సంహితలను తీసుకువచ్చి న్యాయ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు.

ఈశాన్యంలో శాంతి కపోతం: ఈశాన్య రాష్ట్రాలలో శాంతి స్థాపన కోసం 12కు పైగా చారిత్రాత్మక శాంతి ఒప్పందాలు కుదిర్చారు. తద్వారా దాదాపు 11,000 మంది ఉగ్రవాదులు, తీవ్రవాదులు ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలో కలిసేలా చేశారు.

నక్సలిజం అంతం: నిరంతర ఆపరేషన్లు, వ్యూహాత్మక చర్యల ద్వారా 2026 మార్చి నాటికి దేశాన్ని నక్సలిజం కోరల నుండి పూర్తిగా విముక్తి చేశారు.

**సరిహద్దు భద్రత - జలాల సమరం పరిష్కారం**

రాజకీయ చాణక్యుడిగా కేవలం ఢిల్లీకే పరిమితం కాకుండా, ఎంపీగా తన సొంత నియోజకవర్గమైన గాంధీనగర్‌లో నిరంతరం పర్యటిస్తూ ప్రజాక్షేత్రంలోనూ పట్టు నిలుపుకున్నారు. అదే సమయంలో సునీల్ బన్సల్, వినోద్ తావ్డే వంటి ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని తీర్చిదిద్ది పార్టీ మేనేజ్‌మెంట్‌లో తన మార్కు చూపించారు.

## తాజా సంచలనాలు

బెంగాల్ సరిహద్దు రక్షణ: 2026 మే నెలలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిన వెంటనే, బంగ్లాదేశ్ నుండి వచ్చే చొరబాట్లను ఉక్కు పాదంతో అణచివేసేందుకు సరిహద్దులో ఫెన్సింగ్ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేశారు.

యమునా జలాల ఒప్పందం: దశాబ్దాలుగా నలుగుతున్న సమస్యకు తెరదించుతూ.. 2026 జూన్‌లో హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల మధ్య చారిత్రాత్మక 'యమునా జలాల ఒప్పందం' కుదర్చడంలో అమిత్ షా ప్రధాన సూత్రధారిగా వ్యవహరించారు.



# మాకు పాకిస్థాన్ అవసరం లేదు

**పీవోకే హెచ్చరిక**
**22 రోజులుగా ఆందోళనలు**

**మహా** : పాకిస్థాన్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 22 రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. నియంత్రణ రేఖ సమీపంలో రావల్‌కోట్‌లోని జరిగిన ఆందోళనా కార్యక్రమంలో భారీ ఎత్తున నిరసనకారులు పాల్గొన్నారు. సంయుక్త అవామీ కార్యాచరణ కమిటీ నేతలు ప్రసంగిస్తూ.. 'పీవోకే అసలు పాక్‌లో భాగం కాదు' అని స్పష్టం చేశారు. తమకు పాకిస్థాన్ అవసరమే లేదని, వారికే తమ అవసరం ఉందన్నారు. ఆహార సరఫరాలపై ఆంక్షలు కొనసాగిస్తే 'ఇతర మార్గాలను' (భారత్‌తో సన్నిహిత సంబంధాలు) వెతుక్కోవాల్సి ఉంటుందని జాక్ నేతలు హెచ్చరించారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ తీరునూ ఎండగట్టారు. నియంతలా వ్యవహరిస్తే సహించే ప్రసక్తే లేదన్నారు. తమ రాజకీయ లక్ష్యాలు నెరవేరే వరకు నిరసనలు కొనసాగుతాయన్నారు.

# నేటి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్

**హైదరాబాద్, మహా** : తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం కౌంట్‌డౌన్ నేటి నుంచే ప్రారంభమైందని బిజెపి అధ్యక్షులు నితిన్ నబిన్ ప్రకటించారు. మూడు రోజుల రాష్ట్ర పర్యటనలో చివరగా ఘటకేశ్వర్ వద్ద పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ పార్టీ జాతీయ నాయకత్వం తెలంగాణను ప్రత్యేక మిషన్‌గా స్వీకరించిందని ప్రకటించారు. "మన పోరాట దిశను మేము ఇప్పటికే నిర్ణయించుకున్నాం. వీధి నుంచి శాసనసభ వరకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తాం. ఈ ప్రభుత్వ కౌంట్‌డౌన్ నేటి నుంచే ప్రారంభమైందని నేను విశ్వసిస్తున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రతి రూపాయి ఖర్చుకు, ప్రతి నిర్ణయానికి, ప్రతి అవినీతి వ్యవహారానికి బిజెపి కార్యకర్తలు ప్రజల తరఫున పూర్తి లెక్క అడుగుతారు. అందుకు మీరందరూ సిద్ధంగా ఉండాలి" అని పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా తెలంగాణలో పర్యటించిన సందర్భంగా తాను చూసిన దృశ్యాలు, కార్యకర్తల్లో కనిపించిన ఉత్సాహం, ప్రజల్లో నెలకొన్న విశ్వాసం రాష్ట్రంలో పార్టీ భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉండబోతోందని, రానున్న కాలం తెలంగాణలో బీజేపీదే అనే విశ్వాసం మరింత బలపడిందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ఆకాంక్షించిన అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించాలనే సంకల్పాన్ని ఈ కార్యవర్గ సమావేశం ద్వారా మనమంతా చేయాలని ఆయన పిలుపిచ్చారు. నేడు తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాల రాజకీయాన్ని నడుపుతోందని చెబుతూ ప్రతి గ్రామపంచాయతీ, ప్రతి బూత్ స్థాయికి వెళ్లి ఆ అబద్ధాలను ప్రజల ముందు బట్టబయలు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సూచించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో దాదాపు 35 శాతం ఓట్లను సాధించి బిజెపి తన బలమైన ఉనికిని నమోదు చేసిందని చెబుతూ ఇది తెలంగాణ ప్రజల్లో పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. తెలంగాణలో ప్రజాసమస్యలపై, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతికి వ్యతిరేకంగా మనమంతా ప్రజల కోసం వీధుల్లోకి వచ్చి పోరాడేందుకు సిద్ధం కావాలని ఆయన పిలుపిచ్చారు. తెలంగాణలో మార్పు తీసుకురావాలంటే, తెలంగాణ ప్రజల గొంతుకగా నిలవాలంటే వారి సమస్యలతో మమేకం కావాలని, ప్రజల సమస్యలపై పూర్తి శక్తితో ఉద్యమించాలని ఆయన సూచించారు. పార్టీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ఐక్యంగా, అంకితభావంతో



పోరాటం చేస్తే 2028లో తెలంగాణలో విజయం బిజెపిదే కాగలదని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలనే మన ఎన్నికల అజెండాగా చేసుకోమని, గత 12 సంవత్సరాల్లో మా ప్రభుత్వం దేశంలో తీసుకొచ్చిన అభివృద్ధి, మార్పు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలనే ప్రజల ముందుకు తీసుకెళ్తామని పేర్కొంటూ మన పనితీరే మన అజెండా అని తెలిపారు. దేశంలో ఏయే రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయో అక్కడ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేక పోయిందని విమర్శించారు. ఈ ప్రజావ్యతిరేక, నిద్రాణ ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వాదంతో గద్దెదించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇచ్చారా? మహిళలకు ప్రకటించిన ఆర్థిక సహాయం అందించారా? అని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వద్ద సమాధానం ఉండదని ఎద్దేవా చేశారు.

**ఢిల్లీ దర్బార్ సంతోషానికే**

కాంగ్రెస్ నాయకులు ప్రజల సమస్యలను పట్టించుకోవడం కన్నా ఢిల్లీ దర్బార్‌ను సంతోషపెట్టడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని నితన్ నబిన్ చెప్పారు. తెలంగాణను ఏటీఎంలా ఉపయోగించి ఢిల్లీలో తమ రాజకీయాలను నడిపిస్తున్నారని ఆయన ఆరోపించారు. నిజంగా తెలంగాణ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే, ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికే ప్రజలకు చేరేవని చెప్పారు. "నేడు గ్యారంటీల పోస్టర్లు మాత్రం కనిపిస్తున్నాయి. కానీ ఆ గ్యారంటీల ప్రయోజనాలు మాత్రం ప్రజలకు అందలేదు. ఈ వాస్తవాన్ని ప్రతి ఇంటికీ, ప్రతి ప్రజానీకానికి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని తెలిపారు. తెలంగాణ ప్రజల శ్రమతో సంపాదించిన ఒక్క రూపాయి కూడా అక్రమ వసూళ్లకు బలికాకూడదని చెబుతూ ప్రజలను దోచుకునే ఇటువంటి ప్రభుత్వాన్ని ప్రజల ఆశీర్వాదంతో గద్దె దించేందుకు బిజెపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, కుటుంబ పాలనను దాటి ముందుకు వెళ్లలేకపోయిందని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి ఆ ప్రభుత్వ పతనానికి ప్రధాన కారణంగా నిలిచిందని నితిన్ నబిన్ విమర్శించారు. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తోందని పేర్కొంటూ అవినీతి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే అవినీతి అనే స్థాయికి ఆ పార్టీ చేరుకుందని ధ్వజమెత్తారు. నేడు రాజకీయాల నేరీకరణకు కూడా కాంగ్రెస్ పార్టీ ప్రతీకగా మారుతోందని చెబుతూ దేశ వ్యతిరేక శక్తులకు, దేశాన్ని విభజించే ఆలోచనలకు మద్దతు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తన నిజ స్వరూపాన్ని మరోసారి బయటపెడుతోందని మండిపడ్డారు. అందుకే అవినీతి, రాజకీయాల నేరీకరణ అనే రెండు మచ్చలతో కాంగ్రెస్ గుర్తింపు పొందుతోందని చెప్పారు. ఇటీవల మూసీ రివర్‌ఫ్రంట్ పేరుతో చేపట్టిన ప్రాజెక్టులో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తన పాత అవినీతి సంప్రదాయాన్నే కొనసాగిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. ప్రజా ధనాన్ని దోచుకునే మరో అవకాశంగా దానిని మలుస్తున్న పరిస్థితి కనిపిస్తోందని చెప్పారు. తెలంగాణ ప్రజల కష్టార్జిత ధనాన్ని ప్రజల సంక్షేమానికి కాకుండా ఇతర రాజకీయ అవసరాలకు వినియోగిస్తే బిజెపి కార్యకర్తలు ప్రతి రూపాయికి లెక్క అడుగుతారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు కూడా ఆ జవాబుదారీతనాన్ని తప్పకుండా కోరుతారని స్పష్టం చేశారు. తెలంగాణలో మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ కుమ్మక్కు కొనసాగుతోందని ప్రజలు గమనిస్తున్నారని ఆయన తెలిపారు.

**తెలంగాణలో**
**దేవాలయాలకు రక్షణేది**

తెలంగాణలో హిందూ దేవాలయాలు, దేవతల పట్ల అవమానకర ఘటనలు చోటుచేసుకున్నాయని నితిన్ నబిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యప్ప స్వామి ఆలయంపై జరిగిన దాడి వంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తూ అలాంటి ఘటనలకు బాధ్యులైన వారిని ప్రజాస్వామ్యబద్ధంగా నిలదీస్తామని స్పష్టంచేశారు. రానున్న రోజుల్లో ప్రజల ఆకాంక్షలను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తూ తెలంగాణలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా భారతీయ జనతా పార్టీ ఎదుగుతుందని భరోసా వ్యక్తం చేశారు. కుటుంబ పాలన, అవినీతి, హామీల అమలులో వైఫల్యం వంటి రాజకీయాలకు ముగింపు పలకాలంటే మనమంతా మరింత శక్తివంతంగా పోరాటానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీల రాజకీయాల్లో ఉమ్మడి లక్షణాలు మూడు అవినీతి, కుటుంబ పాలన, హామీల అమలులో వైఫల్యం అని విమర్శించారు. అదే సమయంలో వారి రాజకీయాలు బుజ్జగింపు రాజకీయాలపై ఆధారపడితే బిజెపి రాజకీయాలు ప్రతి పౌరుడిని సంతృప్తిపరిచే సమగ్ర అభివృద్ధిపై ఆధారపడి ఉంటాయని తెలిపారు.

# రైతుల పేరుతో కొత్త డ్రామాలు ఆడుతున్నారు

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్, మహా : రైతుల పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త డ్రామాలు ఆడుతున్నారని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని ఆర్థికమంత్రి చెప్పారని, రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని సీఎం చెబుతున్నారని, రెండింటిలో ఎవరి లెక్కలు నిజమో చెప్పాలని హరీశ్ ప్రశ్నించారు. చేసిందేమీ లేదు కాబట్టే ఇష్టం ఉన్నట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయానికి బడ్జెట్ కేటాయింపులే రూ.82 వేల కోట్లు అన్న హరీశ్.. రూ.1.56 లక్షల కోట్లు, రూ.1.75 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేశారని నిలదీశారు. బడ్జెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా అని మండిపడ్డారు. అబద్ధాలు పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్పినంత మాత్రాన రైతులు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రెండు లక్షల రుణమాఫీ అని చెప్పి ఓట్లు అడిగారని, ఇప్పుడు స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల చెప్పడం రైతులను మోసం చేయడం కాదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మేనిఫెస్టోలో ఒకటి చెప్పి, అధికారంలోకి వచ్చాక మరొకటి చెబుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు.




### ఐదు రోజులుగా మొరాయించిన

# రిజిస్ట్రేషన్ల వెబ్‌సైట్

- తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు, న్యాయవాదులు.
- నిలిచిపోయిన స్టాంప్ పేపర్ల విక్రయాలు.
- కోర్టు పనులకు ఆటంకం.
- తక్షణమే సమస్యను పరిష్కరించాలని సర్వత్రా డిమాండ్.

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్లు మొరాయించాయి. మెయింటెనెన్స్ (నిర్వహణ) పేరుతో గత ఐదు రోజులుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన అధికారిక వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ సాంకేతిక సమస్యల పుణ్యమా అని నిర్మానుష్యంగా మారాయి. ముఖ్యంగా అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, న్యాయవాదులకు సంబంధించిన వివిధ కీలక దస్తావేజులు, ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలతో పాటు కోర్టు వ్యవహారాలకు అత్యంత అవసరమైన స్టాంప్ పేపర్లు సైతం అందుబాటులో లేకపోవడంతో అనేక పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.వెబ్‌సైట్ తెరుచుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా స్టాంప్ పేపర్ల అమ్మకాలు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో తమ పనుల నిమిత్తం వస్తున్న సాధారణ ప్రజలతో పాటు అడ్వకేట్లు, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ విక్రేతలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సైట్ ఎప్పుడు పునరుద్ధరిస్తారోనని ఉదయం నుంచి సాయంత్రం వరకు రోజంతా పడిగాపులు కాస్తూ, చివరికి నిరాశతో వెనుదిరుగుతున్నారు. రాజధాని హైదరాబాద్‌లోని హైకోర్టు పరిసర ప్రాంతాలతో పాటు, రంగారెడ్డి కోర్టు, సిటీ సివిల్ కోర్టు తదితర కీలక ప్రాంతాల్లో ఈ సాంకేతిక సమస్య తీవ్రత స్పష్టంగా కనిపిస్తోంది. కనీసం అత్యవసరాలకు కూడా స్టాంప్ పేపర్లు అందుబాటులో లేకపోవడంతో అనేక న్యాయపరమైన ప్రక్రియలు, కేసుల విచారణలు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ రోజుల్లో కేవలం ఒక్క గంటపాటు వెబ్‌సైట్ పనిచేయకపోయినా ప్రజలు, రియల్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుంది. అలాంటిది ఏకంగా వరుసగా ఐదు రోజులుగా వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో ప్రజల సహనం కట్టలు తెంచుకుంటోంది. అధికారుల తీరుపై పలువురు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ స్తంభన ఇలాగే కొనసాగితే అటు ప్రజలకు ఇబ్బందులతో పాటు ఇటు ప్రభుత్వానికి కూడా కోట్లాది రూపాయల మేర భారీ ఆదాయ నష్టం కలిగే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. స్టాంప్ విక్రేతలు కూడా రోజువారీ అమ్మకాలు లేక ఖాళీగా కూర్చోవాల్సిన దుస్థితి ఏర్పడింది.ప్రజల ఆస్తులు, న్యాయపరమైన హక్కులతో ముడిపడి ఉన్న ఈ రిజిస్ట్రేషన్లు, స్టాంపుల విక్రయాలను ప్రభుత్వం అత్యవసర సేవగా పరిగణించాల్సిన అవసరం ఉందని పలువురు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, యుద్ధప్రాతిపదికన వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. అలాగే, భవిష్యత్తులో ఇటువంటి తీవ్రమైన సాంకేతిక సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా, సర్వర్ల సామర్థ్యాన్ని పెంచి పటిష్టమైన శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రజలు, అడ్వకేట్లు, స్టాంప్ విక్రేతలు ప్రభుత్వాన్ని ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు

### బకాయిలు పెట్టింది బకాసురుడు

# కట్టే పాపం మాకా?

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమేనని రేవంత్ తెలిపారు. అయితే తెలంగాణ వచ్చాక కేసీఆర్ చేసిన అప్పు రూ.8.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. అప్పుల ఊబిలో మునిగిన రాష్ట్రాన్ని తనకు అప్పగించారన్నారు. ఎన్నికల ముందు రూ.6 లక్షల కోట్లు అప్పు ఉందని తాము భావించామని, పదవి చేపట్టి లెక్కలు తీస్తే గుట్టల కొద్ది అప్పులు బయటపడ్డాయన్నారు. 2023లో సీఎస్ వంటి ఐఏఎస్‌లకే 1న జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కొన్నేళ్లుగా జీతాలు వాయిదాల పద్ధతిలో వస్తున్నాయని అధికారులు తనకు చెప్పారన్నారు.

**కాళేశ్వరం కూలేశ్వరం అయ్యింది**

రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలేశ్వరం అయిందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బోరు కింద పంట పండితే కూడా కాళేశ్వరం మహిమ అని మోసం చేశారని మండిపడ్డారు. కూలిన కాళేశ్వరం నుంచి మూడేళ్లుగా చుక్క నీరు కూడా తీసుకోలేదన్నారు. కాళేశ్వరం కూలినా ఇవాళ వరిసాగులో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ప్రజలకు ఏం చేశారని కేసీఆర్ మళ్లీ రావాలని అనుకుంటారని సీఎం ప్రశ్నించారు. ఒక్కసారైనా రైతు రుణమాఫీని పూర్తి చేశారా? దళితులకు మూడెకరాల భూమి ఇచ్చారా? పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారా? అని నిలదీశారు.

**కేసీఆర్ మళ్లీ వస్తే చేసేదేమీ ఉండదు**

కేసీఆర్ హయాంలో ఊరూరికి బెల్ట్ షాప్ తెచ్చి, తాగుడు కల్చర్ తెచ్చారని విమర్శించారు. కేసీఆర్, మోదీ, కాంగ్రెస్ పాలనపై చర్చ పెడదామని సవాల్



చేశారు. పేదల ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఇచ్చారా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బెంగాల్‌లో ఉడికిన పప్పులు తెలంగాణలో ఉడకవన్నారు. అక్కడ గెలిచేందుకు బీజేపీ 15 ఏళ్లు పట్టిందని తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావడానికి మరో 15 ఏళ్లు పడుతుందన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల్లోకి తెచ్చామన్న సీఎం, మహిళలకు ఉచిత ప్రయాణం ఇస్తున్నామని ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారని మండిపడ్డారు. మహిళలతోనే సోలార్ విద్యుత్ ప్లాంట్ పెట్టించి వ్యాపారులుగా చేశామని రేవంత్‌రెడ్డి చెప్పారు. రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, ప్రభుత్వంలో ప్రతి శాఖలో కొలువులు భర్తీ చేశామన్నారు. అరుంధతి సినిమాలో పశుపతిలా కేసీఆర్ ను ప్రజలు ఫామ్ హౌజ్ లో బందీచేశారని అన్నారు. కేసీఆర్ మళ్లీ వస్తే చేసేదేమీ ఉండదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, పొన్నం ప్రభాకర్, విప్ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఛైర్మన్లు పాల్గొన్నారు.

### బంగారం దొరికిందన్న ప్రచారం

# పొలానికి పెరిగిన డిమాండ్!

- ఆరెకరాల భూమిపై బంగారు కలలు.
- రాత్రిళ్లు తవ్వకాలతో కలకలం.
- వరంగల్ జిల్లాలో సంచలనం.
- పుకార్లతో పరుగులు తీస్తున్న జనం.
- పొలం చుట్టూ ఉత్కంఠ.

**హైదరాబాద్, మహా.**ఒక సాధారణ వ్యవసాయ పొలం.. అందులో మహిళా కూలీలు కలుపు తీస్తుండగా బంగారు ఆభరణాలు దొరికాయనే ప్రచారం ఒక్కసారిగా చుట్టుపక్కల గ్రామాలన్నింటినీ ఉలిక్కిపడేలా చేసింది. వరంగల్ జిల్లా కోపాకులపాడు గ్రామంలోని ఆరెకరాల వ్యవసాయ భూమి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గతంలోనూ ఇదే ప్రాంతంలో బంగారం, పురాతన దేవతా విగ్రహాలు లభించాయంటూ ప్రచారం జరగడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటున్నారు. ఈ పరిస్థితి యజమానులను ఆందోళనకు గురిచేయగా, పోలీసులు రంగంలోకి దిగారు.

కోపాకులపాడులో బంగారం ప్రచారంతో కలకలం

వరంగల్ జిల్లా కోపాకులపాడు గ్రామంలో ఉన్న ఆరెకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల మహిళా కూలీలు కలుపు తీస్తుండగా బంగారు ఆభరణాలు లభించాయనే వార్త వేగంగా వ్యాపించింది. నోటిమాటగా మొదలైన ఈ ప్రచారం కొద్ది గంటల్లోనే చుట్టుపక్కల గ్రామాలకు చేరడంతో భారీ సంఖ్యలో ప్రజలు ఆ భూమివైపు తరలివస్తున్నారు. దీంతో ప్రశాంతంగా ఉన్న వ్యవసాయ భూమి ఒక్కసారిగా ఆసక్తి కేంద్రంగా మారింది.



గత ఘటనలను గుర్తు చేస్తున్న గ్రామస్థులు

గ్రామ పెద్దలు, స్థానికులు చెబుతున్న వివరాల ప్రకారం ఇదే ప్రాంతంలో 1991 సంవత్సరంలోనూ బంగారు వస్తువులు, పురాతన దేవతా విగ్రహాలు వెలుగుచూశాయని ప్రచారం జరిగింది. అనంతరం కూడా పలుమార్లు ఇలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఈ పాత ప్రచారాలే ఇప్పుడు మళ్లీ తెరపైకి రావడంతో ప్రజల్లో ఆసక్తి మరింత పెరిగింది.

**పొలానికి పెరిగిన కౌలు డిమాండ్**

బంగారం దొరికిందన్న ప్రచారం కారణంగా ఆ భూమిని కౌలుకు తీసుకోవడానికి రైతులు, వ్యాపారులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. సాధారణంగా వ్యవసాయ అవసరాలకే పరిమితమయ్యే భూమి ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ప్రచారం కారణంగా భూమి విలువ కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చర్చించుకుంటున్నారు.

**రాత్రివేళల్లో భూమిలో సంచరిస్తున్న జనం**

ప్రచారం మరింత ఊపందుకోవడంతో రాత్రి వేళల్లో కూడా చుట్టుపక్కల గ్రామాల నుంచి పలువురు ఆ భూమికి చేరుకుని గాలింపు చేపడుతున్నట్లు సమాచారం. ఎక్కడైనా పురాతన నిధులు దొరుకుతాయనే ఆశతో కొందరు భూమిలో సంచరిస్తుండటంతో యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా భూమిలోకి ప్రవేశించడం వల్ల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు.

**ోలీసులను ఆశ్రయించిన యజమానులు**


ఈ పరిణామాలతో భూమి యజమాని, అలాగే మాజీ యజమాని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమతి లేకుండా తమ భూమిలోకి ప్రవేశిస్తున్న వారిని అడ్డుకోవాలని, చట్టవిరుద్ధంగా తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు పరిస్థితిని పరిశీలిస్తూ భూమి వద్ద నిఘా పెంచినట్లు సమాచారం.

**ప్రచారాలపై అధికారిక నిర్ధారణ లేదు**

బంగారు ఆభరణాలు దొరికాయన్న వార్త సామాజిక మాధ్యమాల్లో, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉన్నప్పటికీ, దీనిపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. నిజంగా పురాతన విలువైన వస్తువులు లభించాయా లేదా అనే విషయంపై సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అప్పటివరకు ప్రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని స్థానిక అధికారులు సూచిస్తున్నారు.

# ట్రంప్ కు అమెరికా సుప్రీంకోర్టు షాక్

**ఢిల్లీ, మహా.:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో తీవ్ర భంగపాటు ఎదురైంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న ప్రతిష్ఠాత్మక 'బర్త్‌రైట్ సిటిజన్‌షిప్' (పుట్టుకతో వచ్చే పౌరసత్వం) హక్కును అమెరికా సుప్రీంకోర్టు గట్టిగా సమర్థించింది. అమెరికా గడ్డపై చట్టవిరుద్ధంగా లేదా తాత్కాలిక వీసాలపై నివసిస్తున్న విదేశీ తల్లిదండ్రులకు పుట్టే పిల్లలకు పౌరసత్వాన్ని నిరాకరిస్తూ అధ్యక్షుడు ట్రంప్ గతంలో జారీ చేసిన వివాదాస్పద కార్యనిర్వాహక ఉత్తర్వులను సుప్రీంకోర్టు పూర్తిగా కొట్టివేసింది. అమెరికా సరిహద్దుల్లో జన్మించిన దాదాపు ప్రతి ఒక్కరికీ పుట్టుకతోనే అమెరికన్ పౌరసత్వం పొందే హక్కును కొనసాగించేలా 63 మెజారిటీతో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. అంతకుముందు, వలస విధానాలపై కఠినంగా వ్యవహరించే క్రమంలో పౌరసత్వ అర్హతలపై ట్రంప్ విధించిన ఈ పరిమితులను అమెరికాలోని పలు కిందిస్థాయి న్యాయస్థానాలు తీవ్రంగా తప్పుబట్టాయి. ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ రాజ్యాంగ విరుద్ధమంటూ దాని అమలుపై కింది కోర్టులు స్టే విధించాయి. అయితే, కింది కోర్టుల నిర్ణయాలను సవాలు చేస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. గత కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో ఇరుపక్షాల వాదనలు సుదీర్ఘంగా సాగాయి.. ఈ చారిత్రాత్మక తీర్పుతో అమెరికాలో నివసిస్తున్న భారతీయులతో పాటు లక్షలాది మంది వలసదారులకు, ముఖ్యంగా తాత్కాలిక వీసాలపై ఉన్న విదేశీయులకు పౌరసత్వ పరంగా ఎదురవుతున్న పెద్ద ముప్పు తప్పినట్లయింది.



# రేపు తెలంగాణ కేబినెట్ అత్యవసర భేటీ

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ అత్యవసరంగా భేటీ కానుంది. జులై 2వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ కీలక సమావేశం జరగబోతోంది. సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ హాల్‌లో జరిగే ఈ 34వ మంత్రిమండలి భేటీకి సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశం ఖరారు కావడంతో సచివాలయంలో పరిపాలనా పరమైన హడావుడి మొదలైంది. ప్రభుత్వంలోని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తమ తమ శాఖలకు సంబంధించిన అజెండా అంశాలను సిద్ధం చేసే పనిలో పడ్డారు. నూతన సీఎస్, కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

# జెన్సీ ప్రాంతంలో సీడ్స్ విక్రయాలు సబబేనా..?

**సీడ్ ఆర్గనైజర్లను కట్టడి చేసేదెవరు..?**
**నకిలీలతో రైతులు గందరగోళం.**
**పట్టించుకోని అధికారులు.**

దమ్మపేట ,మహా : అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ ప్రాంత రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోతున్నారు. వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు ను సీడ్ ఉత్పత్తి కోసం సాగు చేస్తున్నారు. అంతా సవ్యంగా ఉంటే అనుకునేదేలేదు కదా. కొందరు దళారాలు ఇదే అదునుగా తీసుకుని సీడ్ ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే సీడ్స్ ను హైబ్రిడ్ జాతికి చెందిన నకిలీ విత్తనాలను రైతులకు అంటకడుతూ సొమ్ము చేసుకుంటూ ,అమాయక రైతులను నిలువునా మోసం చేస్తూ అధికారులకు కాసులు ఎర వేస్తున్నారని రైతులు కొందరు ఆవేదన చెందుతున్నారు.

ఇటీవల ఇదే విషయమై మండలంలో నకిలీ సీడ్స్ విక్రయించి ,పంట వెన్ను తీసే సమయంలో నకిలీ సీడ్ వచ్చిందంటూ కొంత మేరకు పంటను నాశనం చేసిన ఘటన చోటుచేసుకుంది. ఈ విషయంలో రైతులబోదిబోమంటున్నా గానీ అధికారులు తాము చేసిన తప్పును సరిదిద్దుకొనే ప్రయత్నం చేసారే తప్ప ,సగటు రైతుకు మాత్రం తగిన న్యాయం చేయలేక పోయారని రైతులు ఆరోపిస్తున్నారు. మొత్తం మండలంలో కొన్ని వేల ఎకరాల్లో నకిలీ సీడ్స్ యదేశ్చగా విక్రయాలు చేస్తున్నారు. కొందరు రైతులు బయట పడుతున్నారు ,మరికొందరు తమ కే ఎందుకు నష్టం జరిగిందో తెలియక ముభావంగా ఉంటున్నారు. సీడ్ ఆర్గనైజర్ల




కు వ్యతిరేకంగా ప్రశ్నిస్తే ,మళ్ళీ వచ్చే వ్యవసాయ సాగు కాలానికి సీడ్ ఇస్తారో లేదో ననే భయంతో వెనుకంజ వేస్తున్నారు.

**సీడ్ విక్రయాలకు అనుమతులు ఉన్నాయా...?**

ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు సీడ్ అమ్మకాలు న్యాయబద్ధంగా చేసుకోవడానికి సరైన అనుమతులు ఈ ప్రాంత వ్యాపారులకు సక్రమంగా ఉన్నాయా..? అనే సందేహం రైతులకు కలుగుతుంది. సీడ్ ఇనస్పెక్టర్ ఐనటువంటి ఈ మండల వ్యవసాయ శాఖ అధికారి ఈ విషయమై తనిఖీలు చేస్తున్నారా...? లేదా..? చేస్తే వాస్తవాలు తెలపాలని రైతులు కోరుతున్నారు. సీడ్ విక్రయాలు జరపాలంటే జిల్లా వ్యవసాయ అధికారి నుండి సీడ్ డీలర్ లైసెన్స్ పత్రం కలిగి ఉండాలి. అందుకు అవసరమైన అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అంతేగాక ఐటిడిఎ అధికారులనుండి లిఖితపూర్వకంగా అనుమతులు కలిగి ఉండాల్సి ఉంది. జిల్లా కలక్టర్ నుండి యన్‌ఓసి కలిగి ఉండి , గిరిజన సహకార సంస్థల ద్వారా నే సీడ్స్ విక్రయాలు జరగాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టకుండా ఎవరుపడితే వారు ఇష్టారాజ్యంగా సీడ్స్ విక్రయాలు జరుపుతుంటే సీడ్స్ ఇనస్పెక్టర్ ఏం చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**చట్టం ఏం చెబుతోంది :** గిరిజన ప్రాంతాలలో లేదా షెడ్యూల్ ఏరియా నిబంధనలు ప్రకారం ఏజెన్సీ ప్రాంతాలు 5వ షెడ్యూల్ కిందకు వస్తాయి. ఇక్కడ విత్తనాల విక్రయం, వ్యాపారం చేయాలంటే ఐటిడిఎ లేదా స్థానిక గిరిజన శాఖ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. సీడ్ లైసెన్స్ - సాధారణంగా విత్తన విక్రయానికి సీడ్ యాక్ట్ 1966 , సీడ్ రూల్స్ 1968 ప్రకారం జిల్లా వ్యవసాయ శాఖ నుండి సీడ్ లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఏజెన్సీలో అదనపు షరతులు వర్తిస్తాయి. గిరిజనేతరులు ఏజెన్సీలో వ్యాపారం చేయాలంటే ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ చట్టం 1959 (1/70 )ప్రకారం కలెక్టర్ లేదా ఐటిడిఎ పివో అనుమతులు కావాల్సి ఉంది. ఈ అనుమతులు ఉన్నాయా లేదా అనేది స్థానికంగా ఉన్న సీడ్ ఇనస్పెక్టర్ ఐనటువంటి వ్యవసాయ శాఖ అధికారి పర్యవేక్షించాల్సి ఉంది. ముఖ్యంగా హైబ్రీడ్ సీడ్స్ కు అనుమతులు ఎలా ఉన్నయనేది చర్చనీయాంశంగా మారింది.

# మంత్రి శ్రీధర్ బాబు దంపతులపై ఏఐ మార్ఫింగ్ వీడియోలు

**సైబర్ నేరస్థులపై పోలీసులకు ఫిర్యాదు**
**మంత్రి తరఫున ఫిర్యాదు చేసిన లాయర్ శశిభూషణ్**

హైదరాబాద్, మహా : సైబర్ నేరగాళ్లు సామాన్యులు, ఉద్యోగులను మాత్రమే కాదు.. మంత్రులను సైతం టార్గెట్ చేస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్ దంపతులపై సోషల్ మీడియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా క్రియేట్ చేసిన మార్ఫింగ్ వీడియోలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో అభ్యంతరకర కంటెంట్‌తో కూడిన వీడియోలను పోస్టు చేస్తూ, వారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగేలా కుట్రలు జరుగుతున్నాయని లాయర్ శశిభూషణ్ కాశే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉన్నతమైన పదవులు, స్థానాల్లో ఉన్న వారి ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కొందరు ఈ వెకిలి పనులు చేస్తున్నారని, అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసు నమోదు చేసిన పోలీసులు

సరికొత్త ఏఐ టెక్నాలజీని దుర్వినియోగం చేస్తూ నకిలీ వీడియోలు క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియా వేదికల్లో పోస్ట్ చేసి వైరల్ చేస్తున్నారని లాయర్ శశిభూషణ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో ముఖ్యంగా



ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిధుల అక్రమాలకు సంబంధించిన అంశంలో మంత్రి శ్రీధర్ బాబును తప్పుడు రీతిలో చిత్రీకరిస్తూ ఈ ఫేక్ వీడియోలను సర్క్యులేట్ చేస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ మంథని అనే ఫేస్‌బుక్ పేజీ ద్వారా సైతం దుష్ప్రచారం చేస్తున్నారని, అందుకు సంబంధించిన ఆధారాలను పోలీసులకు సమర్పించారు. మంత్రి శ్రీధర్ బాబు లాయర్ ఫిర్యాదు ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# రాజకీయ జోక్యానికి తావుండొద్దు

**చెన్నై, మహా:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పాలనలో రాజకీయ జోక్యానికి ఏమాత్రం తావుండకూడదని అధికారులకు స్పష్టం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా చట్టం ముందు అందరూ సమానమేనని, నిష్పాక్షికంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రాష్ట్రంలోని కలెక్టర్లు, ఎస్పీలు, కమిషనర్లు, ఐజీలు, డీఐజీలు తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన రెండు రోజుల సమీక్ష సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. మహిళల భద్రత, డ్రగ్స్ నిర్మూలన, వ్యవస్థీకృత నేరాల అణచివేత ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని విజయ్ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విచారణను వేగవంతం చేయాలని, పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో డ్రగ్స్ ముఠాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, అక్రమ మద్యం, ఇసుక అక్రమ తవ్వకాలు, ఖనిజాల స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రజలకు పారదర్శక పాలన, మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేయాలని కోరారు.

# పరుగో.. పరుగు...



ఎన్నికల నగరా మోగలేదు. అసలు ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి లేదు. ప్రజలకు అసలు ఆ ఊసే పట్టట్లేదు. ఎవరి పనుల్లో వారు బిజీగా వున్నారు. అయినా రాజకీయ పార్టీలు మాత్రం ఎక్కడ లేని హడావిడి చేస్తున్నాయి. ఇంకో నెల రోజుల్లో ఎన్నికలు జరగబోతున్నాయి అనే తరహాలో పరుగులు తీస్తున్నాయి. ఎటు చూసినా అగ్ర నేతల పర్యటనలు. సభలు. సమావేశాలు. హామీలు. సవాళ్లు. విమర్శలు. ఆరోపణలు. నేతలు ఎవరికీ వారే కొంచెం కూడా తగ్గకుండా పరుగులు తీస్తున్నారు. ఇది ఇప్పుడు తెలంగాణలో రియల్ సీన్. రాజకీయ పార్టీల హంగామా చూస్తున్న జనానికి అయోమయంగా వుంది. ఎన్నికలు వచ్చాయా? అనే అనుమానం వస్తోంది. ఇప్పట్లో చెప్పుకోదగిన ఎన్నికలు లేవు. మరి రాజకీయ పార్టీలు ఎందుకు ఇంతగా రచ్చ చేస్తున్నాయి. అసలు ఏమిటీ ఈ నేతల ఉరుకులు. ఇదే ఇప్పుడు జనానికి అర్ధం కావటం లేదు. తెల్లవారింది మొదలు, రాత్రి పొద్దు పోయే వరకు తెలంగాణలో పొలిటికల్ హీట్ ఓ రేంజ్ లో సాగి పోతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, బీఆర్ఎస్, చివరికి ఎంఐఎం కూడా రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణలో ఏదో జరుగుతోంది అనే పరిస్థితి కల్పిస్తున్నాయి. నేతల పర్యటనలకు కొదువే లేకుండా పోయింది. సభలతో సందడే, సందడి ఏర్పడుతోంది. సవాళ్ళకు అంతే లేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సహచర మంత్రులు, పీసీసీ అధ్యక్షులు, ఇతర కాంగ్రెస్ నేతలు క్షణం తీరిక లేకుండా పరుగులు పెడుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఇదే స్థాయిలో పోటీ పడుతున్నారు. తామేమి తక్కువ కాదన్నట్టు ఎంఐఎం లీడర్స్ కూడా ఇప్పుడు ఈ హడావిడిలో ముందు వరుసలోకి వచ్చేశారు. తెలంగాణలో ఎటు చూసినా, ఏ ప్రాంతానికి వెళ్లినా పొలిటికల్ పెనుగాలుల వాతావరణం ఇప్పుడు కనిపిస్తోంది.

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు జరిగేందుకు ఇంకా రెండున్నర ఏళ్ల సమయం వుంది. పార్లమెంట్ ఎన్నికలకు మూడేళ్ల గడువు వుంది. అయినా ఇప్పుడే తెలంగాణలో రాజకీయ పార్టీలు ఎన్నికల సందడిని తలపించే రీతిలో పోటా, పోటీగా ఎందుకు తలపడుతున్నాయి. ఈ సందేహం సామాన్య జనానికి రావటం సహజం. ఇక్కడే రాజకీయ పార్టీల వ్యూహం వుంది. ప్రజలు తమను మరిచిపోకూడదు. నిత్యం తమ గురించి మాట్లాడుకోవాలి. ప్రజల కోసం తాము ఏదో చేస్తున్నాం అనే భావన ఎప్పుడు సజీవంగా ఉండాలి. అదే అసలు ప్లాన్. ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటనతో తెలంగాణలో రాజకీయ రగడ మొదలు అయింది. దీనికి ఎక్కడ బ్రేక్ పడకుండా పార్టీలు యధాశక్తి ప్రయత్నం చేస్తూ వస్తున్నాయి. ఇదే ఇప్పుడు తెలంగాణలో రాజకీయ హడావిడికి కారణం అయింది. ఇందులో కాంగ్రెస్ పార్టీ ఓ అడుగు ముందే వుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు అంటూ సీఎం రేవంత్ రెడ్డి రోజుకో ప్రకటన చేస్తున్నారు. దాని ప్రారంభోత్సవం పేరుతో ఇక బహిరంగ సభల ఏర్పాటు సరేసరి. ఈ వేదికలు ప్రచారాలకు సాధనంగా మారుతున్నాయి. రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేసిన పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అమలు చేస్తున్న హామీలు చెప్పుకొస్తున్న కాంగ్రెస్ నేతలు అదే వేదిక పై నుంచి బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వెలుగు చూసిన అంశాలు గట్టిగా ప్రస్తావనకు తెచ్చి ఎండగడుతున్నారు. అంతటితో ఆగి పోవటం లేదు. పదేళ్ల బీఆర్ఎస్ పరిపాలన, రెండున్నరేళ్ళ కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సై అంటూ సవాళ్ళ మీద సవాళ్లు విసురుతున్నారు. కేంద్రంలోని ఎన్ డిఎ ప్రభుత్వాన్ని కూడా రాష్ట్ర కాంగ్రెస్ నేతలు గట్టిగా టార్గెట్ చేస్తున్నారు. 12 ఏళ్ల నుంచి ప్రధానిగా వున్న నరేంద్ర మోడీ తెలంగాణకు ఏమి చేయలేదని ఎండ గడుతున్నారు. కాంగ్రెస్ నేతలు కస్సుబుస్సుమంటూ కయ్యానికి కాలుదువ్వుతుంటే తాము చూస్తూ కూర్చుంటామా... నెవర్... అంటూ బీఆర్ఎస్ నేతలు, బీజేపీ రంగంలోకి దిగారు. ఇక్కడి నుంచే అసలు కథ మొదలు అయింది. తమలపాకుతో మీరు ఒకటిస్తే తలుపు చెక్కతో మేం రెండిస్తాం అనే సామెత తరహాలో ఇప్పుడు అధికార కాంగ్రెస్ నేతలు, విపక్ష నేతలు ఒకరిపై ఒకరు ఓ రేంజ్ లో విమర్శలు, ఆరోపణలు, సవాళ్లు విసురుకుంటున్నారు.

తెలంగాణలో ఒకప్పుడు ఇంతగా రాజకీయ సెగలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు రాజకీయాలకే రాజకీయం నేర్పే స్థాయిలో ఇక్కడ పరిస్థితి మారిపోయింది. పార్టీల విషయంలో ప్రజల అభిప్రాయం ఎలా వున్నా నేతలు అభిప్రాయం మాత్రం ఒక్కటే. కాంగ్రెస్ రెండున్నరేళ్ళ పాలనలో తెలంగాణ రేజింగ్ దశకు చేరుకుందని, అభివృద్ధి అత్యంత వేగంగా సాగిపోతోందని, సంక్షేమ కార్యక్రమంలో తెలంగాణ దూసుకుపోతోందని, పెట్టుబడులతో ప్రగతి పథంలో పరుగులు తీస్తోందని సీఎం రేవంత్ సహా కాంగ్రెస్ పార్టీ నేతలు నిత్యం చెప్పేస్తున్నారు. ఇదంతా మేడి పండు మెరుపని విపక్షాలు కొట్టి పారేస్తున్నాయి. అసలు రేవంత్ రెడ్డికి పాలనపై పట్టు లేదని బీఆర్ఎస్ నేతలు పెదవి విరుస్తున్నారు. దోచుకోవటం, ఆ సొమ్మును మూటలు కట్టి ఢిల్లీకి పంపటం, ఇదే ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పాలన అంటూ బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావుతో పాటు ఆ పార్టీ నేతలు రోజు చేస్తున్న ఆరోపణలు. శుష్క వాగ్దానాలు చేసి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా ప్రజలకు శూన్య హస్తం చూపించిందని వారు నిప్పులు చెరుగుతున్నారు. కాంగ్రెస్ పోవాలి... కేసీఆర్. రావాలి అంటూ ఇప్పుడు ప్రజలు కోరుకుంటున్నారు అంటున్నారు బీఆర్ఎస్ నేతలు. దీనికి కాంగ్రెస్ నుంచి కౌంటర్లు పెద్ద ఎత్తునే వస్తున్నాయి. బీఆర్ఎస్ తెలంగాణను దోచుకొని సర్వనాశనం చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో లక్ష కోట్లు బీఆర్ఎస్ నేతలు దోపిడీ చేశారని, బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ కుటుంబం బంగారుమయం అయిందని ఎదురు దాడి చేస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ల నిత్య పోరుకు బీజేపీ కూడా తోడు అయింది. తెలంగాణకు ప్రధాని నరేంద్ర మోడీ ఏం చేసారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించటంపై రాష్ట్ర కమలనాధులు కన్నెర్ర చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్లలో రూ. 12 లక్షల కోట్లు తెలంగాణకు మంజూరు చేసారని రాష్ట్ర బీజేపీ నేతలు లెక్కలు చెప్తున్నారు. మోడీ సహాయం, సహకారం లేకపోతే అసలు తెలంగాణ అభివృద్ధి లేదు అనేది కమలం నేతల వాదన. మోడీ ఏం అభివృద్ధి చేశారో, ఆయన విధానాలు ఏమిటో దేశ ప్రజలకు స్పష్టంగా తెలుసు అన్నది వారి వాదన. తెలంగాణకు కేంద్రం చేసిన సహాయం పై ఎలాంటి చర్చకైనా సిద్దమే అంటున్నారు బీజేపీ నేతలు. పాలన చేతకాక పదే పదే కేంద్రం పై బురద చల్లటం కాంగ్రెస్ నేతలు పనిగా పెట్టుకున్నారని వారు నిప్పులు చెరుగుతున్నారు. కాంగ్రెస్ అసమర్ధ పాలన పై తెలంగాణ ప్రజలు విసిగిపోయారు. ఇప్పుడు తెలంగాణ ప్రజల చూపులు బీజేపీ వైపు వున్నాయి. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే తెలంగాణ రూపు రేకలు మారిపోతాయని ప్రజలు నమ్ముతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసం తథ్యం అంటూ జోష్యం చెప్పేస్తున్నారు. తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ అగ్రనేతలు కూడా రంగంలోకి దిగుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ మూడు రోజులు పాటు తెలంగాణలో తిష్ట వేసి బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలు చేస్తున్న పొరపాట్లు ఏమిటో, వాటిని ఎలా సరిదిద్దుకోవాలో వివరించారు. దింతో ఇప్పుడు తెలంగాణ బీజేపీ కొత్త వ్యూహంతో రంగంలోకి దిగుతోంది.

ఎన్నికలకు ఆరు నెలలు, లేదా ఏడాది ముందు రాజకీయ పార్టీలు గెలుపు వ్యూహంపై దృష్టి పెట్టటం ఇప్పటి వరకు జరుగుతూ వచ్చింది. తెలంగాణలో మాత్రం రెండున్నర ఏళ్లకు ముందే ఈ తంతు మొదలు అయింది. కాంగ్రెస్, బీజేపీ అగ్ర నేతలు ఇప్పుడు తెలంగాణపై కన్నేశారు. అగ్రనేతల పర్యటనలు పెరుగుతూ వస్తున్నాయి. రాష్ట్ర నేతలు కూడా అదే స్థాయిలో హంగామా చేస్తున్నారు. పార్టీలు ఇప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కన్నా వచ్చే ఎన్నికలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతున్నాయి. ఇదే ఇప్పుడు ప్రజలకు ఇబ్బందిగా మారుతోంది. పార్టీల రాజకీయాలు అధికారం కోసమే. కానీ ప్రజలు. నిత్యజీవన సమరంతో నలిగి పోతుంటారు. ఏ పార్టీ ఎన్ని ఎత్తుగడలు వేసినా, జిమిక్కులు చేసినా అంతిమ తీర్పు ఇవ్వాల్సింది ప్రజలు. అది పార్టీలు గుర్తు పెట్టుకోవాలి. కానీ ఇప్పుడు పార్టీలు నేల విడిచి సాము చేస్తున్నాయి. ప్రజలకు విరక్తి కలిగించే స్థాయిలో వ్యవహరిస్తున్నాయి. ఏదైనా అతిగా చేస్తే ఫలితం ప్రతికూలంగా వస్తుంది. ఇప్పుడు రాజకీయ పార్టీలు దీన్ని గుర్తించాలి. ఇప్పటికే తెలంగాణలో రాజకీయ రొచ్చు పెరిగింది. దీన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇంకా హద్దులు దాటి పార్టీలు ప్రవర్తిస్తే అందుకు ప్రజలు సమయం చూసి జవాబు చెప్తారు. నిక్కచ్చిగా చెప్పాలి అంటే కర్రు కాల్చి వాత పెడతారు... నేతలు... తస్మాత్ జాగ్రత్త...



జీ. వెంకటరమణ.
సీనియర్ జర్నలిస్ట్.

# కడుపు ఉబ్బరం, అజీర్తి... నిర్లక్ష్యం చేస్తే ముప్పే!

## జీవనశైలిలో చిన్న మార్పులతోనే జీర్ణ సమస్యలకు చెక్

ప్రస్తుత జీవనశైలిలో అజీర్తి, కడుపు ఉబ్బరం, గ్యాస్, గుండెల్లో మంట వంటి జీర్ణ సంబంధిత సమస్యలు చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఇంట్లోనూ కనిపిస్తున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్యంలో మాత్రమే ఎక్కువగా కనిపించే ఈ సమస్యలు ఇప్పుడు యువతలోనూ, ఉద్యోగుల్లోనూ, విద్యార్థుల్లోనూ సాధారణంగా మారాయి. వేళకు భోజనం చేయకపోవడం, ఫాస్ట్ ఫుడ్‌లపై అధిక ఆధారపడటం, శారీరక శ్రమ తగ్గిపోవడం, ఒత్తిడి పెరగడం వంటి కారణాల వల్ల అజీర్తి సమస్య రోజురోజుకూ పెరుగుతోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన జీర్ణవ్యాధులకు దారితీసే వకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### జీవనశైలిలో మార్పులతోనే ఉపశమనం

అజీర్తి సమస్యను నివారించడంలో మందుల కంటే జీవనశైలిలో మార్పులు ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ప్రతిరోజూ ఉదయం పరగడుపున ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగడం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆహారం తినేటప్పుడు మొబైల్ ఫోన్, టీవీ వంటి వాటికి దూరంగా ఉండి ప్రశాంతంగా భోజనం చేయాలి. ప్రతి ముద్దను బాగా నమిలి తినడం వల్ల లాలాజలం ఆహారంతో కలిసి జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.




### అజీర్తి అంటే ఏమిటి?

మనం తీసుకునే ఆహారం కడుపులోని జీర్ణరసాల సహాయంతో సక్రమంగా జీర్ణమై శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుంది. అయితే ఈ సహజ ప్రక్రియలో అంతరాయం ఏర్పడితే అజీర్తి సమస్య మొదలవుతుంది. ఆహారాన్ని సరిగా నమలకుండా త్వరత్వరగా మింగేయడం, అతిగా తినడం, రాత్రివేళ ఆలస్యంగా భోజనం చేయడం లేదా భోజనం చేసిన వెంటనే పడుకోవడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. దీంతో కడుపులో గ్యాస్ పేరుకుపోయి ఉబ్బరం, గుండెల్లో మంట, పుల్లటి తేన్పులు, వికారం, కడుపు బరువుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### రాత్రి భోజనం ఎలా ఉండాలి?

రాత్రి భోజనం వీలైనంత త్వరగా, ముఖ్యంగా రాత్రి ఎనిమిది గంటలలోపే ముగించడం మంచిది. తేలికపాటి ఆహారం తీసుకోవడం వల్ల కడుపుపై ఒత్తిడి తగ్గుతుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం కాకుండా కనీసం పది నుంచి పదిహేను నిమిషాలు నెమ్మదిగా నడవడం వల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దీంతో గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది.



### చిట్కాలతో మంచి ఫలితాలు

మన వంటింట్లోనే లభించే కొన్ని సహజ పదార్థాలు అజీర్తి సమస్యను తగ్గించడంలో ఉపయోగపడతాయి. భోజనం అనంతరం కొద్దిగా వాము లేదా సోంపు గింజలు నమలడం వల్ల గ్యాస్ సమస్య తగ్గుతుంది. అల్లం రసంలో కొద్దిగా తేనె కలిపి తీసుకోవడం జీర్ణశక్తిని పెంచుతుంది. అలాగే జీలకర్ర కషాయం తాగడం వల్ల కడుపులో అసౌకర్యం తగ్గి జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోజువారీ ఆహారంలో మజ్జిగ, పీచు పదార్థాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.

### ఈ అలవాట్లు తప్పనిసరి

రోజుకు తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడిని తగ్గించే యోగా లేదా ధ్యానం చేయడం, కనీసం ఏడు నుంచి ఎనిమిది గంటల నిద్రపోవడం వంటి అలవాట్లు జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. వారానికి ఒకరోజైనా నూనె పదార్థాలకు దూరంగా ఉండి తేలికపాటి ఆహారం తీసుకోవడం వల్ల కడుపుకు విశ్రాంతి లభిస్తుంది.

### ఎప్పుడు వైద్యులను సంప్రదించాలి?

అజీర్తి సమస్య తరచూ రావడం, తీవ్రమైన కడుపునొప్పి, రక్త వాంతులు, బరువు తగ్గడం, మింగడంలో ఇబ్బంది, మలంలో రక్తం కనిపించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. స్వయంగా మందులు వాడటం కంటే వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.

### ఆరోగ్యమే అసలైన సంపద

అజీర్తి అనేది చిన్న సమస్యగా కనిపించినా నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. సమయానికి భోజనం చేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమ పెంచడం, సహజమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా చాలా వరకు ఈ సమస్యను నివారించవచ్చు. చిన్న చిన్న జాగ్రత్తలు, ఆరోగ్యకరమైన జీవనశైలి, వైద్యులు సూచించిన నియమాలను పాటించడం ద్వారా కడుపు ఉబ్బరం, అజీర్తికి శాశ్వతంగా చెక్ పెట్టవచ్చు.

### నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే సమస్యలు

చాలామంది అజీర్తి వచ్చినప్పుడు యాంటాసిడ్ మాత్రలు లేదా సిరప్‌లతో తాత్కాలిక ఉపశమనం పొందాలని చూస్తారు. కానీ సమస్య పదేపదే వస్తున్నా పట్టించుకోకపోతే గ్యాస్ట్రిక్ అల్సర్లు, మలబద్ధకం, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, తీవ్రమైన నొప్పులు, ఆహారం జీర్ణం కాకపోవడం వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తరచూ అజీర్తి బాధిస్తే వైద్యులను సంప్రదించి కారణాన్ని తెలుసుకోవడం అవసరం.

### అజీర్తికి ప్రధాన కారణాలు

ఆధునిక జీవనశైలే అజీర్తికి ప్రధాన కారణంగా మారుతోంది. ఫాస్ట్ ఫుడ్‌లు, మసాలాలు ఎక్కువగా ఉండే ఆహారం, నూనె పదార్థాలు అధికంగా తీసుకోవడం, తక్కువ నీరు తాగడం, వ్యాయామం చేయకపోవడం, మానసిక ఒత్తిడి, తగినంత నిద్ర లేకపోవడం, ధూమపానం, మద్యం వంటి అలవాట్లు జీర్ణవ్యవస్థ పనితీరును దెబ్బతీస్తాయి. అలాగే కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చోవడం, శారీరక శ్రమ లేకపోవడం కూడా ఈ సమస్యను మరింత పెంచుతుంది.





# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**రామగుండం 30 జూన్ మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు ఆయన సతీమణి మనాలి ఠాకూర్ గారి ఆదేశాల మేరకు, నియోజకవర్గంలోని లబ్ధిదారులకు ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఈ క్రమంలో, మాటేటి విజయ మంజూరైన నూతన గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ గృహప్రవేశ వేడుకలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మెరుగు అశోక్ గౌడ్, ఉప అధ్యక్షులు నూకల గట్టయ్య, గ్రామ మహిళా అధ్యక్షురాలు నాగురి జ్యోతి, మాజీ ఎంపిటిసి దేవనందల రాజమౌళి, ధారవేణి రాజయ్య మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను తనిఖీ చేసిన కలెక్టర్***

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా తూర్పు నియోజకవర్గం లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను జిల్లా కలెక్టర్ డాక్టర్.సత్య శారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సేవల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులు తప్పకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ తనిఖీలో సంబంధిత మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి ఎస్ కే ధర్మరాజ్, ఆయుర్వేదిక కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అనసూర్య, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

- **సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపు**

**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా** జులై 4, 5, 6 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని శ్రీ సాయి శ్రీనివాస (దివ్య) ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి మండలం సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం సుందరయ్య భవనం, భువనగిరిలో జరగగా ఈ సమావేశంలో నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కొత్త కొత్త విధానాలతో ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని అన్నారు. మరోపక్క పెద్ద ఎత్తున నిత్యవసర వస్తువుల ధరలు పెంచి సామాన్య మానవుని జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. మతోన్మాదాన్ని మను వాద భావజాలాన్ని పెంచి మనువాద సిద్ధాంతాన్ని అమలు చేయడానికి, భారత రాజ్యాంగానికి తూట్లు పొడవడానికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో దొడ్డిదారిన అధికారం చేపట్టడానికి ప్రజల ఓట్లను తగ్గించడానికి ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ జాబితా సవరణ అనే కుంటి సాకుతో నిజమైన ఓట్లను తొలగించడానికి పెద్ద ఎత్తున కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. గ్రామీణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనిని వెంటనే రద్దు చేయాలని నర్సింహ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల మీద కార్యకర్తలకు అవగాహన కల్పించడానికి ఈ రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణా తరగతులను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ గారు ప్రారంభించి బోధిస్తారని వారితో పాటు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి యండి. జహంగీర్, రాష్ట్ర నాయకులు బండారి రమేష్ బోధిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేష్, కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు కొండపురం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవల్లో అంతరాయం

**ఆదిలాబాద్ మహా:** రాష్ట్ర వ్యాప్తంగా సర్వర్ అప్డేట్ కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో సబ్ రిజిస్టర్ కార్యాలయలో మంగళవారం రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలిగింది. సర్వర్ నిదానంగా పని చేయడంతో ఉదయం నుంచి రిజిస్ట్రేషన్‌లు పెండింగ్లో పడిపోయాయి. దీంతో కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చినవారు వెనుతిరిగి పోయారు.. కార్యాలయంలో సిబ్బంది మాత్రమే పనిచేస్తూ కనిపించారు. ఉదయం నుండి కేవలం ఒక రిజిస్ట్రేషన్ మాత్రమే అయిందని ప్రతిరోజు సుమారు 30 వరకు



రిజిస్ట్రేషన్లు జరిగేవని సబ్ రిజిష్ట్రార్ శ్రీలత తెలిపారు. సర్వర్ అప్డేట్ కావడానికి వారం పడుతుందని ఆమె అన్నారు.

# కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**నిర్మల్ మహా:** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ,రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి



ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## భువన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా** సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం భువనగిరి తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి జూనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం అందజేశారు రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా ఉండాలని పూర్తిగా వాళ్ళ సంక్షేమాన్ని మరిచిందని అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన సంక్షేమ బోర్డు ద్వారా లబ్ధి పొందుతున్న కార్మికులు కాంగ్రెస్ పార్టీ సంక్షేమ బోర్డు నిర్లక్ష్యం చేస్తూ కార్మికుల ద్వారా జమ చేస్తున్న డబ్బులు వేలాది కోట్ల రూపాయలు రాష్ట్ర అభివృద్ధి కోసం ఆ డబ్బులను ఖర్చు చేస్తుందని ఇన్సూరెన్స్ పేరుతో రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ కంపెనీలో అప్పచెప్తుతున్నదని ఏళ్ల అనేక పోరాటాలు చేసి తెచ్చుకున్న సంక్షేమ బోర్డును నిర్లక్ష్యం చేస్తున్నదని అనేక పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కారం చేయడం లేదని ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రభుత్వం ఆధీనంలో జరుగుతున్న ప్రాజెక్టులు బిల్డింగులు రోడ్డు నిర్మాణంలో ఒక శాతం కార్మికుల సంక్షేమ బోర్డుకు కేటాయించాలని కార్మిక సమస్యలు పరిష్కరించి సంక్షేమాన్ని పథకాల అమలు చేయాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ, మన్నె రాజు, కొత్తపెల్లి వెంకటేష్, ఎండి గౌస్ తదితర కార్మికులు పాల్గొన్నారు.



## గంజాయిపై అప్రమత్తంగా ఉండాలి

**మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మండలంలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున్ రెడ్డి సూచించారు. గంజాయి నేడు సమాజం ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటిగా మారిందని, పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచి యువత వరకు కొందరు దీని బారిన పడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐ మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడమే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులుసంచరిస్తున్నా, గంజాయి విక్రయాలు లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాల పరిసరాలు, పాన్ షాపులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే గంజాయి నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సీఐ సూచించారు. మత్తు పదార్థాలపై సమాచారమిచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, గంజాయి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సీఐ మల్లికార్జున్ రెడ్డి పిలుపునిచ్చారు.

# నా పూర్తి మద్దతు గ్రామ ప్రజలకు

**బీజేపీ కౌన్సిలర్ షాబాద్ కిషన్**

**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ పేద ప్రజలకు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 60 గజాల పట్టాలకు స్థలాలు చూపించాలంటూ హిమాయత్ నగర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటానికి 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్ మాట్లాడుతూ నా సంపూర్ణ మద్దతు గ్రామ ప్రజలకు ఉంటుందని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఆలోచించి హిమాయత్ నగర్ పేద ప్రజలకు గతంలో ఇచ్చిన 60గజాల పట్టాలకు స్థలం చూపించి న్యాయం చేయాలని కోరారు. లేకుంటే బీజేపీ మండల, జిల్లా, రాష్ట నాయకులతో మాట్లాడి పోరాటని ఉదృత్తం చేస్తామని తెలిపారు. హిమాయత్ నగర్ మున్సిపల్ ప్రజలకు 60 గజాల స్థలాలు చూపించే వరకు పోరాటం చేస్తామని తెలిపారు.

# యువత ప్రజా సేవకు ముందుకు రావాలి

**మందమర్రి, మహా :** యువరక్తం ప్రజా సేవకు ముందుకు రావాలని లైన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ సొత్కు సుదర్శన్, ప్రోగ్రాం కో చైర్మన్, పోలు శ్రీనివాస్, అరసవెల్లి శ్రీనివాస్, కొక్కుల మధు, తౌటం. శ్రీనివాస్, కొట్ల అనిత లు అన్నారు. మంగళవారం మందమర్రి శ్రీకృష్ణ ఫంక్షన్ హాల్ ఆఫ్ 202627 సంవత్సరం నూతన కార్యవర్గ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అధ్యక్షునిగా పెండ్యాల గౌతమ్ చారి, కార్యదర్శిగా ఎండి జాకీర్ , కోశాధికారిగా బుర్ర ఆంజనేయులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీకి రిక్కల నారాయణరెడ్డి రెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేశ, రాష్ట్రస్థాయిలో లయన్స్ క్లబ్ సేవలు కు విశేష గుర్తింపు ఉందని తెలిపారు. ఈ క్లబ్ లక్షల మంది నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించి కంటి వెలుగును ప్రసాదించిందని వెల్లడించారు. అంతేకాకుండా మందమర్రి పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించి పేరు ప్రఖ్యాతలను మూటగట్టుకుందని పేర్కొన్నారు. లైన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను మా వంతు కర్తవ్యం గా భావించి మునుముందుకు కార్యక్రమాలను తీసుకువెళ్లి సంస్థకు పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి

**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా** : ఉద్యమకారులకు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 250 గజాల ఇంటి ప్లాటు, 30 వేల పెన్షన్, తెలంగాణ ఉద్యమకారుడుగా గుర్తింపు కార్డు, హెల్త్ కార్డును జాప్యం లేకుండా వెంటనే ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ డిమాండ్ చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని ఆర్యవైశ్య భవనంలో మంగళవారం జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ జాప్యం చేస్తుందని అన్నారు నీళ్లు నిధులు నియామకాల కోసం పోరాడి తెలంగాణ సాధించుకుంటే గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ కూడా ఉద్యమకారులను విస్మరించారని ఆయన ఆరోపించారు... ఆలేరులో జేఏసీ నాయకుడు కీర్తిశేషులు సత్యనారాయణ విగ్రహం, అమరవీరుల స్థూపంను త్వరలో నిర్మించుకుందామని రాజకీయాలకు కతీతంగా అందరూ సహకరించాలని కోరారు ఉప్పల్ బాగాయత్ లోని ప్రభుత్వ భూమిని తెలంగాణ ఉద్యమకారుల ఇంటి స్థలాలకు కేటాయించాలని పూస శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, మొరిగాడి వెంకటేష్,అశోక్, బాలస్వామి, పసునూరి వీరేశం, జంపాల శ్రీనివాస్, రాచకొండ జనార్ధన్, కళ్లెపు అడవయ్య, చెక్క వెంకటేష్, పూల నాగయ్య, ఎర్ర జాన్సన్, చిలుక శ్రీనివాస్, సీస మహేశ్వరి, పుట్టల కిష్టయ్య, రచ్చ రామ్ నరసయ్య పలువురు ఉద్యమకారులు ఉన్నారు.

## ఉమ్మడి కార్యాచరణ దిశగా జవహర్ నగర్ దమ్మాయిగూడ డంపింగ్ జేఏసీలు

**రాంకీ డంపింగ్ యార్డ్ తొలగించే లక్ష్యంగా జేఏసీల తీర్మానం.**

**కుషాయిగూడ, మహా :** జవహర్ నగర్, దమ్మాయిగూడ ప్రజలతోపాటు డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపే లక్ష్యంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ యాంటీ డంపింగ్ యార్డ్ దమ్మాయిగూడ జేఏసీ నేతల భవిష్యత్ కార్యాచరణకు అంగీకారం కుదిరిందని చైర్మన్ షేక్షావలి కన్వీనర్, డాక్టర్ శంకర్నారాయణ స్పష్టం చేశారు. నీలం రామచంద్రయ్య భవన్ లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ అధ్యక్షతన కో కన్వీనర్స్ కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, 16 లక్షల మంది ప్రజల వాయు కాలుష్యం, నీటి కాలుష్య వివిధ అనారోగ్య సమస్యతో పాటు పర్యావరణ ధ్వంసం పై దమ్మాయిగూడ జేఏసీ నేతలైన కన్వీనర్ శంకర్ నారాయణ కో కన్వీనర్ సమ్మిరెడ్డి సంజీవరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎక్కువేత పోరాట కమిటీ సమావేశం లో వివిధ అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016 నుండి దమ్మైగూడ జేఏసీ తరఫున చేసిన న్యాయ



పోరాటాన్ని వివరిస్తూ ప్రస్తుతం ప్రజల ప్రాణాలతో పాటు రాబోయే తరానికి మంచి గాలి నీరు పర్యావరణం అందించాల్సిన బాధ్యత బాధ్యత ప్రాంతాల్లో ప్రశ్నించి పోరాడే శక్తులతో పాటు కీసర శామీర్ పేట, యాప్రాల్, కాప్రా, ఘట్కేసర్ దమ్మాయిగూడ మండలాల ప్రజలపై ఉందని తెలియజేశారు ప్రస్తుతం జవహర్ నగర్ జేఏసీ దమ్మాయిగూడ జేఏసీలు సమిష్టిగా డంపింగ్ యార్డ్ ఎత్తివేసే వరకు ఐక్యంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఇకపై జవహర్ నగర్ జేఏసీతో దమ్మాయిగూడ జేఏసీ కలిసి పనిచేయడానికి తమ మధ్య ఒప్పందం కుదిరిందని తెలిపారు.



## సిల్క్ నగర్‌లో ఓటరు అవగాహన

**యాదాద్రి భువనగిరి, జూన్ 30 (మహా):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని 7వ వార్డు పరిధిలోని సిల్క్ నగర్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో నమోదైన ఓటర్లకు ఫారాల పంపిణీతో పాటు అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి అర్హత కలిగిన ఓటరు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన ఫారాలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన పేరు, వివరాలు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదై ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అంగడి ఆంజనేయులు, 9వ వార్డు కౌన్సిలర్ పస్తం ఆంజనేయులు, స్థానిక బీఎల్ఓ, కాంగ్రెస్ పార్టీ వార్డు బీఎల్ఏ తాళ్లపల్లి మహేష్, కాలనీవాసులు చింతకింది సిద్ధులు, చింతకింది రంగ, ఎండి మునీర్, చింతకింది గిరి తదితరులు పాల్గొన్నారు.



## క్రమశిక్షణకు మారు పేరు ఏఎస్ఐ ఆంజనేయులు

**సీఐలు యాలాద్రి,శంకర్**

**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా** క్రమశిక్షణకు మారుపేరు వృత్తి పట్ల నిబద్ధత, 36 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో చిన్న మచ్చ కూడా నేడు పదవి విరమణ పొందుతున్న ఏఎస్ఐ ఆంజనేయులుకు లేదని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగం చేయాలని పోలీస్ సిబ్బందికి ఆలేరు, యాదగిరిగుట్ట సీఐలు యాలాద్రి ,శంకర్ లు అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా పని చేసి మంగళవారం పదవి విరమణ పొందుతున్న ఏ ఎస్ ఐ ఆంజనేయులు దంపతులను పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్ లో సీఐ, ఎస్ఐ లు ఘనంగా సన్మానించారు ఆలేరు ఎస్ఐ వినయ్ తో పాటు స్టేషన్ సిబ్బంది పలు గ్రామాల ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు సత్యనారాయణ దంపతులను ఘనంగా జ్ఞాపికలు, పూలమాలలు,శాలువాలతో సత్కరించారు ఈ సందర్భంగా సిఐలు మాట్లాడుతూ ఓపిక సహనం ఆయన ద్వారా నేర్చుకోవాలని అన్నారు పదవి విరమణ అనంతరం శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో సుఖంగా గడపాలని సిఐలు అన్నారు.

## నియోజకవర్గంలో రూ. 93కోట్ల రైతుభరోసా నిదులు విడుదల

**49 వేల రైతుల ఖాతాలలో జమ.**
**హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు.**

**దమ్మపేట,మహా:** అశ్వారావుపేట నియోజకవర్గంలో మొత్తం 48,838మంది రైతులకు తమ తమ ఖాతాలలో రైతుభరోసా పథకం ద్వారా వివిద దశలలో షుమారుగా 93 కోట్ల రూపాయలు జమ కానున్నట్లు శాసనసభ్యులు జారె ఆదినారాయణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు పట్వారిగూడెం రైతు వేదిక లో జరిగిన టెలికాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన అధికారులు,ప్రజాప్రతినిదులతో కలిసి పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రైతుభరోసా పథకాన్ని రాజదాని నుండి ప్రారంభించారని తెలిపారు. 92 కోట్ల,72 లక్షల 50వేల 912 రూపాయలు నియోజకవర్గ రైతుల ఖాతాలకు జమ కాబడతాయని ఎమ్మెల్యే వివరించారు. ఈ మొత్తాన్ని రైతులు తమ వ్యవసాయ సాగు పెట్టుబడి కోసం రైతులు ఉపయోగించుకొని లాభసాటి వ్యవసాయాన్ని సేద్యం చేస్తారని ఆయన ఆశించారు. కార్యక్రమంలో సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు, ఏడిఏ రవికుమార్,మండల వ్యవసాయ శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి,ఏఇవో కేశవరావు తదితరులు పాల్గొన్నారు.





## దామరపల్లి నర్సింహారెడ్డి రచించిన పాటల సిడిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మహా**: పశు సంపద తగ్గిపాయె ఆ పశువులన్నీ కనుమరుగాయే.. పశు గ్రాసం లేక తెలంగాణ పల్లెలన్నీ మోడు బారెనో.. అనే పాటల సీడీని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు ల చేతుల మీదుగా ఆవిష్కరించారు.. మంగళవారం కుషాయిగూడ సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి నివాసంలో పాటల సిడి ఆవిష్కరణ జరిగింది.. రచయిత దామరపల్లి నర్సింహారెడ్డి రచించిన పశు సంపద కరిగిపాయనో పశు గ్రాసం లేక పల్లెలన్నీ మోడు బారెనో. గానం అపూర్వ. సంగీతం స్వర కల్పన, ఎడిటింగ్ దండేపల్లి శ్రీను, కామెర, నిర్మాత జక్క రోషిరెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలలో పశు సంపద ఘననీయంగా తగ్గిందని, పశు సంపద లేకపోవడం వ్యవసాయ రంగానికి పాడి రంగానికి అత్యంత ప్రమాదం పొంచి ఉందని, ఎండు పశుగ్రాసం లేక పశువులన్నీ కబేలాలకు తరలిపోతున్నాయని, వచ్చే తరాలకు పశు సంపద ఎలా ఉంటదో తెలియకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క కుటుంబం పశువును పెంచుకొని భావితరాలకు దిక్సూచిగా నిలవాలని పిలుపునిచ్చారు నేడు పశు సంపద పశువుల పేడ లేకపోవడంతో వ్యవసాయ భూముల్లో విష రసాయనాలు చల్లడం వల్ల విషపు, భూములై మనల్ని తరిమి వేస్తున్నాయని ప్రతి ఒక్క వ్యక్తి ఏదో ఒక రోగం బారిన పడి, తనువును చాలి స్తున్నారని టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. పశుసంపద లేకపోవడం వల్ల, యంత్రాలు వచ్చి పశువులు లేకుండా పశువులు లేకుండా చేశాయని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు మాట్లాడుతూ, పశు సంపదపై ప్రభుత్వాలు చిత్త శుద్ధితో వ్యవహరించాలని, పశువులను పరిరక్షిస్తే అవి మనల్ని పరిరక్షిస్తాయి అని అన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు కాసం మహిపాల్ రెడ్డి, కుమారస్వామి షేర్ మనమ్మ, గంప కృష్ణ గుప్తా, మురళి పంతులు, బొమ్మ అమరేందర్ చింతల విజయ్ కుమార్, జింక రఘు, చిలుకూరి అఖిలేష్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## రూ.50 కోట్లతో వ్యాపారి పరారీ

**కమిషనర్‌కు బాధితుల ఫిర్యాదు**

**కుషాయిగూడ, మహా :** అత్యవసర అవసరాలు, వ్యాపార లావాదేవీలు, అధిక వడ్డీ ఇస్తానంటూ పలువురి నుంచి సుమారు రూ.50 కోట్లకు పైగా అప్పు తీసుకుని ఓ వ్యాపారి పరారయ్యాడని బాధితులు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతికి ఫిర్యాదు చేశారు.బాధితుల కథనం ప్రకారం.. కుషాయిగూడ చక్రిపురం భగవాన్ కాలనీకి చెందిన పబ్బ చంద్రశేఖర్ గత 30 ఏళ్లుగా 'శ్రీ వెంకటేశ్వర మార్కెటింగ్' పేరుతో సిమెంట్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కుమార్తె వివాహం, తండ్రి వైద్యం, ఇంటి నిర్మాణం, సిమెంట్ కంపెనీల స్కీమ్‌లు, జీఎస్టీ చెల్లింపులు వంటి కారణాలు చూపుతూ ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద నుంచి అప్పులు తీసుకున్నట్లు తెలిపారు. కొందరికి అధిక వడ్డీ ఇస్తానని నమ్మించి, మరికొందరి వద్ద చే బదులుగా నగదు తీసుకున్నాడు. ఈ నెల 22 నుంచి అతని రెండు సెల్‌ఫోన్లు స్విచ్ ఆఫ్‌లో ఉండగా, అతను, అతని భార్య కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెలను బంధువుల ఇంటి వద్ద వదిలి వెళ్లినట్లు తెలిపారు. సుమారు 60 మందికి పైగా బాధితులు రూ.50 కోట్లకు పైగా నష్టపోయినట్లు రోపించారు.విషయంపై సమగ్ర విచారణ చేపట్టి నిందితుడిని గుర్తించి తమ సొమ్ము ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ కమిషనర్‌ను కోరారు.



## అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలి

- **మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా**: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూర్ లో నూతనంగా నిర్మిస్తున్న నైపుణ్య అభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే చర్యలలో భాగంగా చెన్నూర్ కేంద్రంలో చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కేంద్రం నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే చెన్నూరులో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పనులను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం వైద్య, రంగాలను బలోపేతం చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ఈ క్రమంలో చెన్నూర్ మండల కేంద్రంలో చేపట్టిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు తుది దశకు చేరిందని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ తో కలిసి మునిసిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణం, పైప్ లైన్ల పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పౌష్టిక ఆహారం అందించాలని కోరారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడి ఫిజిక్స్ సబ్జెక్టులో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 3, 4, 11 వార్డులలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణను మండల తాసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి పరిశీలించారు. జూలై 24 నాటి వరకు ఇంటింటి సర్వే నిర్వహించి ప్రతి అర్హులైన ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి, వాటిని సరైన రీతిలో పూరించిన తర్వాత ఆ పారాలను సేకరించాలని చెప్పారు. ఈ ప్రక్రియను జూలై 1 నాటికి పూర్తి చేసి ప్రతి రోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడికి ఘన సన్మానం



**కారేపల్లి, మహా:**కారేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన కర్నాటి శ్రీనివాసరావు మంగళవారం పదవీ విరమణ చేశారు. పదవి విరమణ చేసిన శ్రీనివాసరావు, సతీమణి వసంత దంపతులను పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పలు ఉపాధ్యాయ సంఘాల యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని కొనియాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన శ్రీనివాసరావు పాఠశాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేశారని అన్నారు. విద్యార్థుల ఉత్తీర్ణతలో ఆయన చూపిన శ్రద్ధ మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ సెంటర్ ఉపాధ్యాయులు, తరగతులు భారీగా విద్యార్థిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

# చర్లపల్లి చెరువు పునరుద్ధరణకు శ్రీకారం

- **భూమిపూజ నిర్వహించిన జైళ్ల శాఖ డిజి సౌమ్య మిశ్రా**
- **పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి**
- **దాతల సహకారంతో చెరువుల పునరుద్ధరణకు నడుం బిగించిన జైళ్ళ శాఖ**



**కుషాయిగూడ, మహా**: చర్లపల్లి చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనులకు మంగళవారం భూమిపూజతో శ్రీకారం చుట్టారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో, హైడ్రా సాంకేతిక సహకారంతో, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జైళ్ల శాఖ ఐజీ వై.రాజేష్, డీఐజీలు డాక్టర్ డి.శ్రీనివాస్, ఎం.సంపత్‌తో పాటు హైడ్రా, ఐఓసీఎల్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. చెరువు ఇన్‌లెట్ ప్రాంతం శుభ్రపరచడం, సిల్ట్ కలెక్షన్ చాంబర్ నిర్మాణం, ఇన్‌లెట్ కాలువ పునరుద్ధరణ, చెరువు కట్ట బలోపేతం, బండ్‌పై సోలార్ లైట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. చెరువు పరిసరాలను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ప్రకటించారు. ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరగడంతో పాటు నీటి భద్రత, పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చెరువులు కుంటలు పునరుద్ధరణకు జైళ్ల శాఖ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు చెరువులను పరిరక్షించినట్లయితే అవి భావితరాలకు త్రాగునీటిని అందిస్తాయన్నారు. ఓపెన్ ఎయిర్ జైలు ఖైదీలను ఈ పనుల్లో భాగస్వామ్యం చేయడం ద్వారా వారికి ఉపాధి నైపుణ్యాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని డాక్టర్ సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. చెరువు రక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణకు ఆదర్శంగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు ఎర్రం శెట్టి రాజేష్ మురళి బాబు డీఐజీలు సంపత్ శ్రీనివాసరావు చంచల్ గూడ జైలు పర్యవేక్షణ అధికారి నవాబ్ శివకుమార్ గౌడ్ చర్లపల్లి సెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారి ప్రమోద్ చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం జైలు పర్యవేక్షణ అధికారి డి భరత్ జైలు అధికారులు వెంకటేశం శ్రీనివాస్ ఎం పాల వెంకటరెడ్డి, దేవుజా నాయక్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ నాయకులు కాసం మైపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, స్వచ్ఛంద సంస్థల నేతలు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి జర్నలిస్ట్ కి అండగా ఉంటా

**బీబీనగర్ జూన్ 30 మహా :** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బీబీనగర్ మండల పరిధిలోని రహీంఖాన్ గూడ గ్రామ చెందిన తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి మంచాల అనిల్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురయ్యారు ఈ విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి జర్నలిస్ట్ కి తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ తరుపున అండగా ఉంటామని అన్నారు . రోడ్డు ప్రమాదంలో గురైన జర్నలిస్ట్ అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బక్కన్న నర్సింహా,జిల్లా సభ్యులు సంకూరి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గోధుమవాగు బ్రిడ్జికి మరమ్మత్తులు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**: కొత్తగూడెం పట్టణ పరిధిలోని రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతల మరమ్మత్తులు ముమ్మరంగా సాగుతున్నాయని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. రామవరం గోధుమవాగు బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతోపాటు తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో మున్సిపల్ శాఖ ద్వారా మరమ్మత్తు పనులకు ఆదేశించారు. ఈ మేరకు మేయర్ మూడ్ గణేష్ మంగళవావa రం అక్కడ జరుగుతున్న మరమ్మత్తు పనులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడి నిత్యం ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నా నేషనల్ హైవే అధికారులు ఘోరంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని తమ భాధ్యతను విస్మరించారని అన్నారు. యేండ్ల తరబడి ఈ దుస్థితి నెలకొనడం వల్లే తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందని ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి యుద్ధప్రాతిపదికన ఈ మరమ్మతు పనులకు ఆదేశించామని స్పష్టం చేశారు. వాహనదారులకు ఇకపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను అత్యంత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. మేయర్ వెంట కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, కూరపాటి సుధాకర్, వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణాచారి తదితరులు వున్నారు.



## ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు అమలు చెయ్యాలి

- **మరణించిన, 60 సం. రాలు నిండిన వారి స్థానంలో ఉద్యోగం ఇవ్వాలి**
- **కనీస వేతనం 26 వేలు అమలు చెయ్యాలి**
- **సి.టి.యు. మందమర్రి మున్సిపల్ కమిషనర్ కు వినతి**

**మందమర్రి, మహా** : రాజ్యాంగం కార్మికులకిచ్చిన ఉద్యోగ భద్రత,కనీస వేతనాలు అమలు చెయ్యాలని సి.టి.యు. మంచిర్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంకె రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూలం శ్రీనివాస్ మంగళవారం మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో అనేక సంవత్సరాలుగా వివిధ విభాగల్లో విధులు నిర్వహిస్తున్నకార్మికులకు డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ రాజ్యాంగంలో పొంద పర్చిన హాక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదని విమర్శించారు. కరోనా వైరస్ కాలంలో తమ ప్రాణలను లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడడమే బాధ్యతగా భావించి విధులు నిర్వహించారని స్పష్టం చేశారు.అంతేకాకుండా అనేక సంవత్సరాలుగా అమలు అవుతున్న మరణించిన కార్మికుని స్థానంలో, 60 సంవత్సరాలు వయస్సు నిండినవారి స్థానంలో కుటుంబ సభ్యులకిచ్చే ఉద్యోగ హాక్కును కూడ నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చెయ్యడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెండింగ్లో ఉన్న వారి సమస్యలను తీర్చాలని వారి డిమాండ్ చేశారు.అదే విదంగా కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చెయ్యాలని వివరించారు. ప్రతి కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ కార్మికునికి కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఇక పెండింగ్ లో ఉన్న బట్టలు, చెప్పులు తదితరులు ఇవ్వలని వారు అధికారులను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిటియు జిల్లా నాయకులు కోలా వాసు, చెన్న రాజం, చెన్న రాజ మొగిలి, చిప్పకూర్తి గట్టయ్య, మేడపట్ల నర్సయ్య,, అవునూరి లత, వెంకమ్మ, లింగంపల్లి రవి, పొన్న లక్ష్మణ్, సంగి రాజలింగు, ఆవునూరి మృగరాజు తదితర కార్మికులు పాల్గొన్నారు.



## రైతు భరోసా ప్రత్యక్ష వీక్షణ

**పాలకుర్తి, జూన్ 30 (మహా):** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని రైతు వేదిక కేంద్రాల్లో రైతు భరోసా నిధుల జమ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, తొలి విడతలో 1 నుంచి 2 ఎకరాల లోపు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నామని, మిగిలిన వారికి దశలవారీగా నిధులు అందజేస్తామని తెలిపారు. కొత్త పాస్‌పుస్తకాలు పొందిన రైతులు జూలై 5లోపు బ్యాంకు వివరాలను ఏఈఓకు అందజేయాలని, నిధులు అందని వారు లేదా కేవైసీ, భూమి వివరాలకు సంబంధించిన సమస్యలు ఉన్న రైతులు రైతు వేదికలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, వ్యవసాయశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా :** హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా గంధమల్ల,బస్వపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణ లో భూమి కోల్పోయిన రైతులకు త్వరలోనే నిధుల విడుదల చేస్తామని సీఎం గారు హామీ ఇచ్చినట్లు.ఆలేరు నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెtళ్లగా ప్రత్యేక మైన నిధులు ఇచ్చి. ఆలేరు నియోజకవర్గన్నీ అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్యా మరియు వైద్య రంగాల అభివృద్ధి, సాగునీటి వసతుల మెరుగుదలతో పాటు ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.



## హెడ్ ఓవర్‌మ్యాన్ పదవి విరమణ

**సత్తుపల్లి, జూన్ 30 (మహా):** సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని జలగం వెంగళరావు ఉపరితల గనిలో హెడ్ ఓవర్‌మ్యాన్‌గా 36 ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ చేసిన గిద్దలూరు నాగేశ్వరరావు దంపతులను ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించి బొగ్గు ఉత్పత్తికి విశేష సేవలందించిన నాగేశ్వరరావు భావి జీవితం సుఖసంతోషాలతో సాగాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.



## విద్యా బోధన బాగుండాలి కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ మహా :** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక జిల్లా ఇంటర్మీడియేట్ కార్యాలయంలో మ్యాథ్స్ లెక్చరర్ల కు నిర్వహించిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీస్తూ, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చాల్సిన బాధ్యత అధ్యాపకుల పైనే ఉందన్నారు. కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. ఇందుకోసమే ప్రభుత్వం ప్రత్యేకంగా నెల రోజుల శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ శిక్షణలో నేర్చుకునే నూతన బోధనా పద్ధతులను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి జాదవ్ గణేష్‌కుమార్, అసోసెట్ ప్రొఫెసర్ టి అరుణ్ కుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, ఇతర జూనియర్ లెక్చరర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రెయిన్ బో స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్**

**మొయినాబాద్ మహా:** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మొయినాబాద్ పట్టణ కేంద్రంలో నడుస్తున్నటువంటి రెయిన్బో పాఠశాలను సందర్శించి ఈ సందర్భంగా మొయినాబాద్ ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ మాట్లాడుతూ రెయిన్బో స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, విద్య హక్కు చట్టాన్ని తూట్లు పొడిచే మాదిరిగా పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారు. అలాగే పాఠశాలకు ఫైర్ సేఫ్టీ లేదని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బాత్రూమ్స్, ప్లే గ్రౌండ్ లేదని ఫైర్ వెహికిల్ పాఠశాల భవనం చుట్టూ తిరిగే విధంగా నిబంధన ప్రకారం ఉండాలని బీఈడీ, డీఎడ్ శిక్షణ కలిగిన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరపాలని రెయిన్బో పాఠశాలలో ఎక్కువ మంది ఉపాధ్యాయులకు బీఈడీ అర్హత లేదని అన్నారు ఉపాధ్యాయులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నా రెయిన్బో స్కూల్ పాఠశాల యాజమాన్యం 2006 విద్య హక్కు చట్ట ప్రకారం పాఠశాలలో 25% పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రెయిన్బో స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



# విద్యార్థినిలకు దుప్పట్లు పంపిణీ

**కేజీబీవి కళాశాల**
**విద్యార్థినీలకు దుప్పట్ల పంపిణీ**

**కారేపల్లి, మహా:**మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల, కళాశాలలో మంగళవారం విద్యార్థినిలకు అవసరమైన దుప్పట్లు ,బ్లాంకెట్స్, కార్పెటట్లు ను స్థానిక సర్పంచ్ మేదరి టోని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టోని మాట్లాడుతూ ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు అవసరమైన అన్ని వసతుల ను ప్రభుత్వం సమకూరుస్తుందని అన్నారు. ప్రభుత్వ గురుకులాల పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య బోధన జరుగుతుందని, అందుకనే తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాలో ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూరి రాంబాబు, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య,, షమీనా కౌసర్, వసంత, కవిత, మమత,విజయ, స్వాతి,

## గడువులోగా సర్ కార్యక్రమం
# విజయవంతం చేయాలి

**అడిషనల్ కలక్టర్ ఆదేశం**



దమ్మపేట,మహా: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వే ప్రక్రియ ను పారదర్శకంగా విజయవంతంగా ముగించాలని జిల్లా అధనపు కలక్టర్ డి.వేణుగోపాల్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని మొద్దులగూడెం పంచాయతీ లో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన 106వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటరు జాబితా సవరణ, సర్వే ప్రక్రియ ను ఆయన నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులు అత్యంత ప్రతిభావంతంగా పనితీరు కనబరుస్తున్నారని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ఉత్సాహంతో నిర్దేశిత గడువులోగా ప్రక్రియ మొత్తాన్ని పారదర్శకంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, ఆర్.ఐ.భిక్షమయ్య, ఎలక్షన్ సూపర్వైజర్ రెడ్డి నరసింహారావు, ఎఫ్ జీటీల్ పాషా, పంచాయతీ కార్యదర్శి పూనెం రామకృష్ణ, స్థానిక గ్రామ పెద్దలు, రెవెన్యూ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించకుండా
# ఉపాధి ఎలా కల్పిస్తారు

**నేడు జీపీ కార్యాలయల**
**ఎదుట నిరసన - వ్యకాస**



**కారేపల్లి,మహా:** ఉపాధీ హామీ పథకం(వీబీ జీ రామ్ జీ) కి బడ్జెట్లో రూ.3.50 లక్షల కోట్లకు కేవలం రూ. 90 వేల కోట్లు మాత్రమే కేటాయించి కూలీలకు 125 రోజుల పని దినాలు కల్పిస్తామని చెప్పటం ఎలా సాధ్యమని తెలంగాణ వ్యవసాయకార్మిక సంఘం వైరా డివిజన్ అధ్యక్షకార్యదర్శులు తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కేశగాని ఉపేందర్ అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో వారు మాట్లాడుతూ 2004లో వామపక్షాలు నేతృత్వంలో సాధించుకున్న మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరిస్తూ బీజేపీ ప్రభుత్వం పీవీజీ రామ్ జీ పేరుతో పేదలకు ఉపాధి దూరం చేయుటకు పూనుకుందన్నారు. విభిజి రాంజీ బిల్లును జులై 1 నుండి అమలు చేయనున్నట్లు ప్రకటించిందని, దీనిలో కేంద్రం 60 శాతం రాష్ట్రం 40 శాతం నిధులు భరాయించాలని పేర్కొనటం ఉపాధి కల్పన నుండి కేంద్రం దూరం జరగటమేనన్నారు. ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వాగ్దనం భంగమైందని తిరిగి పేదలకు ఉపాధి చూపే పథకాన్ని కూడా దూరం చేస్తుందన్నారు. కొత్తగా తీసుకొచ్చిన వీబీ జీ రామ్ జీ పథకాన్ని రద్దు చేసి ఉపాధి హామీ గ్యారంటీ చట్టాన్ని కొనసాగించాలని, రెండు సార్లు ఫోటో పద్ధతిని ఎత్తివేయాలని కొలతలతో సంబంధం లేకుండా రెండు వందల రోజుల పని దినాలు, రోజు కూలి రూ 600 చెల్లించాలని డిమాండ్ చేశారు. పేదల పథకానికి బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడవటాన్ని నిరసిస్తూ ఈనెల 1 తేదీన రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాలు వ్యకాస నాయకులు యనమనగండ్ల రవి, ఆమంచి అంజయ్య, కిన్నెర రామచంద్రయ్య, చింతపల్లి ప్రసాద్, బలమల్ల యోహాన్, ఇటుకల లెనిన్, తూము సుధాకర్, బాణాల శ్రీనివాసరావు, చల్ల మల్లమ్మ, గుమ్మ నరసింహారావు, పాసిని నాగేశ్వరరావు, రామచంద్రయ్య, షేక్ సైదులు, దాసరి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నరసింహారావుకు ఘనంగా
# పదవీ విరమణ సన్మానం



**యాదాద్రి భువనగిరి జూన్ 30 మహా** : నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు సేవలు అందించారని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు పదవీ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలో నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేసిన అధికారులు సమాజానికి ఆదర్శప్రాయులని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు తన సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో సంక్షేమ శాఖ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేశారని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, జీవితంలో కొత్త అధ్యాయానికి నాంది అని అదనపు కలెక్టర్ అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయడంలో జిల్లా సంక్షేమ అధికారి ఎంతో కృషి చేశారని, అనేక సంఘటనలలో కలిసిమెలిసి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయడం జరిగిందన్నారు. ముందు ముందు జీవితంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి,ఉన్నతాధికారులకు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అందించిన, అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని అన్నారు. అనంతరం శాలువాలతో పాటు జ్ఞాపిక అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సంక్షేమ శాఖ సిబ్బంది, కుటుంబ సభ్యులు,పాల్గొని నరసింహారావుకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి సేవలను అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు..

# పారిశుధ్య నిర్వహణ నిత్యం సక్రమంగా చేపట్టాలి

- **మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**




**మందమర్రి, మహా** : మందమర్రి మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ నిత్యం సక్రమంగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య ఆదేశించారు. మంగళవారం మందమర్రి మున్సిపాలిటీ చతులాపూర్ గ్రామ శివారులో ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డును మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ప్రతి రోజు తడి, పొడి చెత్తను ఇంటింటి నుండి క్రమం తప్పకుండా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని చెప్పారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఇటీవల అకౌంట్స్ విభాగంలో కార్యాలయంలో లోపల కుంగిపోయిన గదులను పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరాభరణం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్యాలయ భద్రత, నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యాలయ ఆవరణలో మీసేవ కేంద్రాన్ని సందర్శించి సేవలు పొందుతున్న ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ సేవలు నిమిత్తం మీ సేవా కేంద్రానికి వచ్చే ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్, పర్యావరణ ఇంజనీర్ గోపికృష్ణ, రెవెన్యూ అధికారి కృష్ణ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ రాజేశ్వరి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇంటి స్లాబ్ పైనుండి పడి వ్యక్తి మృతి

**బెల్లంపల్లి, మహ :** బెల్లంపల్లి పట్టణంలోని ఇందిరమ్మ ఇంటి స్లాబ్ పైనుండి ప్రమాదవశాత్తు పడి వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పట్టణంలోని టేకులబస్తీలో ఏర్పడింది. సంఘటన వివరాల్లోకి వెళితే పెద్దపల్లి జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రాము (43) తన అత్తగారింటికి నాలుగు రోజుల క్రితం బెల్లంపల్లిలోని టేకులబస్తీకి తన పెద్ద బావమరిది ఇందిరమ్మ ఇంటికి స్లాబ్ వేసుకుంటున్నానని తెలపడంతో రావడం జరిగింది. అయితే సోమవారం రాత్రి తన బావమరిది మల్లంపల్లి శంకర్ ఇంటిలో నిద్రిస్తూ ఉక్కపోతగా ఉందని నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ స్లాప్ పైన పడుకోవడానికి వెళ్లి నిద్ర మత్తులో రాత్రి స్లాబ్ పై నుండి కింద పడి తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించిబెల్లంపల్లి వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేసిన మాజీ ఎమ్మెల్సీ

**వరంగల్ మహా :**వరంగల్ తూర్పు నియోజకవర్గ లోని శివనగర్ చెందిన శివరాత్రి వనమాల అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆ వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 60000 చెక్కును మంజూరు చేయించి బాధితురాలికి అందించారు. ఈ సందర్భంగా శ్రీరాం రాజేష్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు ఆపద వచ్చిన వెంటనే సహాయం చేయడం లో కొండా దంపతులు ముందు ఉంటారని అన్నారు. కొండా దంపతులు ఉన్నంత కాలం తూర్పు నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటారని శ్రీరాం రాజేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దేవర్ల జంప తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

**బెల్లంపల్లి, జూన్ 30 (మహా):** బెల్లంపల్లి మున్సిపాలిటీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆమోదం లభించింది. ఎజెండాలోని మొత్తం పది అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.అభివృద్ధి పనుల నాణ్యత పరిశీలన కోసం ల్యాబ్ ఏర్పాటు, డంపింగ్ యార్డులో విద్యుత్ సౌకర్యాలు, రోడ్ల గుంతల పూడ్చివేత, పారిశుద్ధ్య నిర్వహణకు జేసీబీ అద్దె, కొత్త వీధిదీపాల ఏర్పాటు, స్వచ్ఛభారత్‌లో భాగంగా ఫ్లైఓవర్‌పై వాల్ పెయింటింగ్, మొక్కల ఏర్పాటు, వార్డులు 8, 17, 34లో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణం తదితర పనులకు నిధుల కేటాయింపునకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, కమిషనర్ తన్నీరు రమేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ సురక్ష కార్యక్రమాన్ని
# విజయవంతం చేయాలి

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో;** జాతీయ లక్ష్యమైన 959595 సాధన దిశగా "మిషన్ ఎయిడ్స్ సురక్ష" కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నిర్వహించిన సమీక్ష సమావేశంలో జాతీయ లక్ష్యమైన 959595 సాధనపై విస్తృతంగా చర్చించారు. తొలి 95 లక్ష్యంలో మార్చి నెలలో నమోదైన 23 శాతం నుంచి ప్రస్తుతం 68 శాతానికి పురోగతి సాధించినప్పటికీ, ఇంకా లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉన్నందున రానున్న మూడు నెలల్లో అన్ని శాఖల సమన్వయంతో 95 శాతం లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించే దిశగా కృషి చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతి రోగి క్రమం తప్పకుండా మందులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారందరికీ వైరల్ లోడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం పర్యవేక్షించడం ద్వారా వైరల్ లోడ్ తగ్గి రోగులు ఆరోగ్యంగా జీవించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. మూడో "95" లక్ష్యంలో ఉన్న 1.5 శాతం అంతరాన్ని త్వరగా అధిగమిస్తే రాష్ట్రంలోనే ఉత్తమ కేంద్రంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సంబంధిత అధికారులతో త్వరలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి 959595 లక్ష్య సాధనకు కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తెలంగాణ రాష్ట్ర నోడల్ అధికారి సమేష్, రాష్ట్ర బేసిక్ సర్వీసెస్ జాయింట్ డైరెక్టర్ డా. జయలక్ష్మి, టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ జాయింట్ డైరెక్టర్ ప్రసాద్, రాష్ట్ర సమన్వయకర్త కామేశ్వరరావు, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డా. ప్రకాష్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. అరుణ్‌కుమార్ జోషి, డీపీఎం స్వప్న మాధురి, డీఐఎస్ రామకృష్ణ, సహాయోగి మంజులతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పెట్టుబడి సహాయం రైతుల ఖాతాల్లో జమ

- **జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి బ్యూరో, మహా**: అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతు భరోసా పథకం ప్రయోజనాలను పారదర్శకంగా అందిస్తామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. మంగళవారం జగన్నాధపురం రైతు వేదికలో రైతులతో కలిసి సీఎం రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా పథకం కింద వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సహాయాన్ని అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో విజయవంతంగా జమ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,91,340 మంది రైతులకు రూ.337.06కోట్ల పెట్టుబడి సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 1,78,828 మంది రైతుల ఖాతాల్లో రూ.318.42 కోట్లను నేరుగా జమ చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన అర్హులైన రైతుల ఖాతాల్లో కూడా సాంకేతిక ప్రక్రియ పూర్తికాగానే విడతల వారీగా నిధులు జమ చేయనున్నట్లు తెలిపారు. జూన్ 15 వరకు భూభారతి రికార్డుల్లో నమోదైన (అటవీ హక్కుల చట్టం) పట్టాదారుల వివరాలను కూడా రైతు భరోసా పథకంలో పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. భూభారతి లేదా అటవీ హక్కుల చట్టం పట్టాదారులుగా అర్హత ఉండి సాంకేతిక కారణాల వల్ల ఇంకా పెట్టుబడి సహాయం అందని రైతులు సంబంధిత పత్రాలతో తమ గ్రామ పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. వారి వివరాలను పరిశీలించి జూలై 5, 2026లోపు రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసి అర్హత మేరకు లబ్ధి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా సందేహాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా పథకం ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులకు అవసరమైన సేవలను సకాలంలో అందించేందుకు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రైతు వేదికలలో రైతులు రైతు ఆశీర్వాద సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. ములకలపల్లి మండలం జగన్నాధపురం రైతు వేదికలో జిల్లా కలెక్టర్ అంకిత్ రైతులతో మమేకమై రైతు భరోసా పథకం అమలు పెట్టుబడి సహాయం పంపిణీ ఎరువుల లభ్యత తదితర అంశాలపై రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రైతు వేదికలలో విత్తన మేళా లో భాగంగా వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, సర్పంచ్ కుంజా వినోద్, తహసీల్దార్ స్వాతి బిందు, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, ఏంపిడిఓ సత్యనారాయణ, ఇతర గ్రామాల సర్పంచ్ లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగభూషణం లక్ష్మీ సేవలు మరువలేనివి

**టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు**
**ఊటు యశ్వంత్..**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అర్బన్ ల్యాండ్ సీలింగ్ కార్యాలయంలో సబార్డినేటర్ గా విధులు నిర్వహించిన లక్ష్మి, సర్వే ల్యాండ్ రికార్డు విభాగం నందు విధులు నిర్వహించిన కత్తుల నాగభూషణ్, ఇరువురి పదవి విరమణ కార్యక్రమానికి హాజరైన టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఊటు యశ్వంత్, లక్ష్మి, నాగభూషణం ఇద్దరు గత 26 సంవత్సరాలుగా ప్రభుత్వ విధులు నిర్వహించి సేవలు అందించిన వారి సేవలు మరువలేనివి కొనియాడారు. ఉద్యోగస్తులకు పదవి విరమణ సహజమని తెలిపారు. వీరిరువురు అధికారులకు, తోటి ఉద్యోగస్తులకు మన్నలను పొందారని కొనియాడారు. వీరిరువురు శేషాజీవితం ఆయురారోగ్యలతోటి, సుఖసంతోషాలతోటి, కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఇరువురికి పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి అనంతరెడ్డి, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, తాసిల్దారులు రాజేశ్వరరావు, నాగమణి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్, టిఎన్జీవో ట్రెజరర్ ఆనంద్ సింగ్, డీటి అవినాష్, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.





# పోలీస్ శాఖకు మీ సేవలు మరువలేనివి

- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**
- **ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులకు ఘన సన్మానం**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పోలీస్ శాఖకు మీ సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో దీర్ఘకాలం పాటు ప్రజలకు అంకితభావంతో సేవలందించిన అధికారులను నూతన పోలీసు సిబ్బంది ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. వ్యాయామం యోగా ధ్యానం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను కొనసాగించాలని సూచించారు. పదవీ విరమణ పొందిన అధికారులు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ప్రభుత్వం నుంచి రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి మల్లయ్య స్వామి, ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యనాయక్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు సుధాకర్, లాల్ బాబు, కృష్ణారావు, పోలీసు అధికారుల సంఘం సభ్యులు, సిబ్బంది పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సారపాక లో భారీగా గంజాయి పట్టివేత

**బూర్గంపహాడ్, మహా :** బూర్గంపహాడ్ మండల పరిధిలో సారపాక గ్రామంలోఈగల్ ఫోర్స్ పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ప్రత్యేక తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నారు.ఈ ఘటనలో ఒక బాలుడితో పాటు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుండి మొత్తం 525 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, ఐదు సెల్‌ఫోన్లు మరియు రూ.10,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఈగల్ ఫోర్స్ పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.65 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. గంజాయిని తరలించేందుకు కంటైనర్ లారీలో ప్రత్యేకంగా నిర్మించిన రహస్య గదిని ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా అక్రమ రవాణా నిర్వహిస్తున్న ముఠా వ్యవహారంపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు.

## శిక్షణా కార్యక్రమంలో సర్టిఫికెట్లను అందజేసిన కుడా చైర్మన్ ఇనగాల

**హన్మకొండ మహా;** బాలా వికాస పీపుల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్, న్యూ ఢిల్లీకి చెందిన విశ్వ యువక్ కేంద్ర సంయుక్తంగా నిర్వహించిన మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నివారణ తో పాటు మాదకద్రవ్యాల వ్యసన నిర్మూలన పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ ముగింపు వేడుకకు కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్. డి. రామ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పాల్గొన్న వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ ఎనిమిది రాష్ట్రాల్లోని ఎనిమిది వేలకు పైగా గ్రామాల్లో ఎనభై లక్షల మందికి పైగా ప్రజలకు లబ్ధి చేకూరుస్తూ సామాజిక మార్పు కోసం బాలా వికాస చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం డాక్టర్ ఎస్ డి రామ్ కుమార్ మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం, డ్రగ్స్ నివారణపై అవగాహన పెంచడం చాలా అవసరమని, ప్రభుత్వ ప్రయత్నాలకు ఇలాంటి స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలు ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు.ఈ శిక్షణ ద్వారా మానసిక ఆరోగ్య సమస్యల వెనుక ఉన్న ముఖ్యమైన కారణాలను, ఒత్తిడిని అధిగమించే ఆచరణాత్మక పద్ధతులను తమ పరిధిలోని సమాజంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని గుర్తించి, నివారించే మార్గాలను తాము పూర్తిగా తెలుసు కోగలిగామని శిక్షణలో పాల్గొన్న వారు తమ అనుభవాలను పంచుకున్నారు.

# కరుగుతోన్న పసిడి కాంతులకు కారణాలు ఇవే..



గడిచిన కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలకు చేరుకుంటూ సామాన్యులకు చుక్కలు చూపించిన పసిడి ధరలు, ఇటీవల అనూహ్యంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ రోజు (జూన్ 30, 2026) హైదరాబాద్‌తో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు సుమారు రూ.1,40,000 మార్కు వద్ద ట్రేడ్ అవుతుండగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర సుమారు రూ.1,29,000 స్థాయికి దిగివచ్చింది. గత వారంతో పోలిస్తే ఇది భారీ పతనమనే చెప్పాలి. ఈ ఆకస్మిక మార్పునకు గల ఆర్థిక కారణాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, భవిష్యత్తులో బంగారంపై రాబడులు అందుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై విశ్లేషణాత్మక కథనం మీకోసం.

**ధరలు తగ్గడానికి ప్రధాన కారణాలు**

పసిడి మార్కెట్ ఒడిదుడుకులను గమనిస్తే ప్రస్తుతం మూడు ప్రధానాంశాలు ఈ పతనానికి కారణమవుతున్నట్లు స్పష్టమవుతోంది.

**1. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వైఖరి**

అమెరికా కేంద్రీయ బ్యాంక్ (యూఎస్ ఫెడరల్ రిజర్వ్) వడ్డీ రేట్లను తగ్గిస్తుందని ఈ ఏడాది ఆరంభంలో అంచనా వేసినప్పటికీ తాజా పాలసీ సమావేశంలో వడ్డీ రేట్ల తగ్గింపును 2027కు వాయిదా వేసింది. అంతేకాకుండా, ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయడానికి వడ్డీ రేట్ల పెంపు ఉండొచ్చనే సంకేతాలు ఇచ్చింది. వడ్డీ రేట్లు పెరిగితే బాండ్లు, ఇతర స్థిర ఆదాయ వనరులపై రాబడి పెరుగుతుంది. దీంతో వడ్డీ లేదా డివిడెండ్ ఇవ్వని బంగారం వైపు నుంచి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు.

**2. బలపడుతున్న అమెరికన్ డాలర్, బాండ్ ఈల్డ్స్**

ఫెడ్ నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో యూఎస్ డాలర్ ఇండెక్స్ ఏడాది కాలంలోనే గరిష్ఠ స్థాయికి చేరుకుంది. సాధారణంగా డాలర్ బలపడితే ఇతర కరెన్సీలలో బంగారం కొనడం ఖరీదైనదిగా మారుతుంది. తద్వారా డిమాండ్ తగ్గి ధరలు క్షీణిస్తాయి. గ్లోబల్ గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి, ముఖ్యంగా ఆసియా మార్కెట్ల నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లడం దీనికి అద్దం పడుతోంది.

**3. పశ్చిమాసియాలో సడలిన ఉద్రిక్తతలు**

గత కొద్ది నెలల్లో బంగారం ధరలు భారీగా పెరగడానికి రష్యా-ఉక్రెయిన్, పశ్చిమాసియా (ఇరాన్-అమెరికా/ఇజ్రాయెల్) సంక్షోభాలు ప్రధాన కారణం. అయితే ఇటీవల ఇరాన్, అమెరికాల మధ్య శాంతి చర్చల సరళి, కీలకమైన హార్మూజ్ జలసంధి పాక్షికంగా తెరచుకోవడం వంటి పరిణామాల వల్ల గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు దాదాపు 30% తగ్గాయి. దాంతో అంతర్జాతీయ ఒడిదొడుకులు తగ్గి సురక్షిత పెట్టుబడిగా బంగారానికి ఉన్న డిమాండ్ ప్రీమియం ఒక్కసారిగా ఆవిరైపోయింది.

**భవిష్యత్తులో ఇన్వెస్ట్ మెంట్ మార్గాలు**

ప్రస్తుత ధరల తగ్గుదల అనేది దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఒక అవకాశంగా ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే కేంద్ర బ్యాంకుల వద్ద డీడాలరైజేషన్ (డాలర్‌పై ఆధారపడటం తగ్గించడం) ప్రక్రియలో భాగంగా బంగారాన్ని నిల్వ చేసుకునే ధోరణి ఇంకా కొనసాగుతోంది. అయితే కేవలం భౌతిక బంగారం (నగలు) రూపంలో కాకుండా కొన్ని మార్గాల్లో పెట్టుబడి పెడితే మెరుగైన రాబడులు సాధించవచ్చు.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు:**

స్టాక్ మార్కెట్ ద్వారా డిజిటల్ రూపంలో బంగారం కొనుగోలు చేయడానికి ఇది ఉత్తమ మార్గం. ఇందులో ఎలాంటి మేకింగ్ ఛార్జీలు, తరుగు ఉండవు. మనకు నచ్చినప్పుడు కరెంట్ మార్కెట్ ధరకే విక్రయించుకోవచ్చు. లాకర్ ఖర్చులు, దొంగతనం భయాలు ఉండవు.

**సవరీన్ గోల్డ్ బాండ్లు:**

ప్రభుత్వం/ఆర్‌బీఐ జారీ చేసే ఈ బాండ్లు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు వరం. దీని ద్వారా బంగారం ధర పెరిగితే వచ్చే లాభంతో పాటు, ఏటా స్థిర వడ్డీ (అదనపు ఆదాయం) లభిస్తుంది. అంతేకాకుండా గడువు ముగిసిన తర్వాత వచ్చే లాభాలపై ఎలాంటి క్యాపిటల్ గెయిన్స్ టాక్స్ ఉండదు. అయితే, ప్రస్తుతానికి ఈ బాండ్లను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపేసింది.

**డిజిటల్ గోల్డ్:**

మొబైల్ వాలెట్లు, సర్టిఫైడ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా కేవలం రూ.100తో కూడా పెట్టుబడిని ప్రారంభించవచ్చు. క్రమానుగత పెట్టుబడి విధానం ద్వారా ప్రతి నెలా కొద్దికొద్దిగా బంగారం జమ చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.


**భౌతిక బంగారం (కాయిన్స్/బిస్కెట్లు):**

ఒకవేళ ఫిజికల్ గోల్డ్ కావాలనుకుంటే నగల రూపంలో కాకుండా 24 క్యారెట్ల హాల్‌మార్క్ ఉన్న కాయిన్స్ లేదా బిస్కెట్లు కొనడం మేలు. దీనివల్ల రీసేల్ (తిరిగి అమ్మే) సమయంలో పూర్తి విలువ లభిస్తుంది. మీ మొత్తం ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో బంగారానికి 10% నుంచి 15% వరకు మాత్రమే పరిమితం చేయడం మంచిది. మార్కెట్ ఒడిదుడుకులను తట్టుకోవడానికి ఒకేసారి కాకుండా ప్రస్తుత ధరల పతనాన్ని ఆసరాగా చేసుకుని విడతల వారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా భవిష్యత్తులో స్థిరమైన, సురక్షితమైన రాబడులను అందుకోవచ్చు.

# టెక్కీల ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్న సీఈఓ!

## కుటుంబాలపై వ్యక్తిగత దూషణలు..

సాఫ్ట్ వేర్ రంగం అంటేనే విలాసవంతమైన జీవితం, లక్షల్లో జీతాలు అనుకునే వారికి ఐటీ పరిశ్రమలోని మరో చీకటి కోణం షాక్‌కు గురిచేస్తోంది. ప్రాజెక్ట్ డెడ్‌లైన్ల పేరిట ఉద్యోగుల మానసిక ప్రశాంతతను హరిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న ఒక టాక్సిక్ (విషపూరిత) సీఈఓ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వారాంతాలతో (ఆదివారాలు) కలిపి రోజుకు 14 గంటల పాటు గొడ్డుచాకిరీ చేయించుకోవడమే కాకుండా.. ఉద్యోగుల విద్య, సామర్థ్యం, చివరికి వారి కుటుంబాలను లాగుతూ వ్యక్తిగత దూషణలకు దిగుతున్న ఒక సీఈఓ దారుణ ప్రవర్తనను ఓ సాఫ్ట్ వేర్ డెవలపర్ రెడ్డిట్ వేదికగా పంచుకున్నారు.



**ఆ ప్రాజెక్ట్ ముగిసేలోపే ఇంకోదానికి..**

కంపెనీలో చేరినప్పటి నుంచి తనకు ఎదురవుతున్న నరకాన్ని సదరు టెక్కీ సుదీర్ఘ పోస్ట్‌లో వివరించారు. సంస్థలో జాయిన్ అయినప్పటి నుంచి ఒక ప్రాజెక్ట్ పూర్తికాకముందే మరో దానికి మారుస్తున్నారని, దీనివల్ల దేనిపైనా స్పష్టత లేకుండా పోతోందని పేర్కొన్నారు. 'గత నెల రోజులుగా నేను ఒక క్లయింట్ ఫేసింగ్ డేటామ్యాపింగ్ ప్రాజెక్ట్‌లో బృందంతో కలిసి పని చేస్తున్నాను. మా కంపెనీ సీఈఓనే మాకు మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనే మాకు ఒక నిర్దిష్ట లాజిక్ ఇచ్చారు. అందుబాటులో ఉన్న డేటాను బట్టి మేము ఆ లాజిక్‌ను వర్తింపజేసి, విశ్లేషణను పూర్తి చేసి అవుట్‌పుట్ సమర్పించాం. తీరా చూస్తే, ఆ మ్యాపింగ్ తప్పని క్లయింట్ చెప్పారు' అని టెక్కీ తెలిపారు.

**ఉద్యోగులపై నింద!**

కంపెనీకి క్లయింట్ ఇచ్చిన డేటానే అసంపూర్ణంగా ఉన్నప్పటికీ సీఈఓ మాత్రం మొత్తం నిందను బృందంపైనే నెట్టేసినట్లు డెవలపర్ ఆరోపించారు. 'గత వారం రోజులుగా మీటింగుల్లో ఆయన ప్రవర్తన చాలా వ్యక్తిగతంగా, అవమానకరంగా మారింది. ఇది ఇక పనికి సంబంధించిన ఫీడ్‌బ్యాక్ కాదు. మా విద్య, సామర్థ్యాలు, కుటుంబాలు, విలువపై ఆయన దాడి చేస్తున్నారు. మేము సాంకేతిక పరిమితులను వివరించడానికి ప్రయత్నించినా లేదా ఇప్పటికే పూర్తి చేసిన పనిని చూపించినా ఆయన అసలు వినడం లేదు' అన్నారు. బృందంలోని వారందరినీ ఉద్యోగాల్లోంచి తీసేస్తానంటూ సదరు సీఈఓ నిరంతరం బెదిరింపులకు పాల్పడుతున్నట్లు టెక్కీ వాపోయారు.

**ఆదివారాలూ వదలకుండా 14 గంటల చాకిరీ**

ఈ సంస్థలో పని గంటలు ఊహకందని విధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆదివారాలతో సహా నిరంతరం పని చేయించుకుంటున్నారని తెలిపారు. 'ఇటీవలే మా టీమ్ మొత్తం ఆదివారం కూడా రాత్రి దాకా పని చేసింది. కానీ సోమవారం ఉదయం మీటింగ్‌కు వచ్చిన సీఈఓ.. మేము అసలు మాట వినడం లేదని, సరిగా పని చేయడం లేదని మమ్మల్ని నిందించారు. నేను మానసికంగా, శారీరకంగా పూర్తిగా అలసిపోయాను. కనీసం విశ్రాంతి తీసుకోవడానికి, నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి లేదా మరో ఉద్యోగానికి ఇంటర్వ్యూలు ఇవ్వడానికి కూడా నాకు సమయం దొరకడం లేదు' అని సదరు టెక్కీ తెలిపారు. ఈ ప్రతికూల వాతావరణంలో కొనసాగాలా లేక రాజీనామా చేయాలా అని ఆన్‌లైన్ కమ్యూనిటీని సలహా కోరారు.

**నెటిజన్ల సలహా**

ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారడంతో ఐటీ నిపుణులు, సోషల్ మీడియా వినియోగదారులు సదరు సీఈఓ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆ ఉద్యోగాన్ని వదిలేయాలంటూ టెక్కీకి మద్దతుగా నిలిచారు. 'ఆ సీఈఓకు వ్యక్తిత్వ సమస్య ఉంది. బహుశా అతనికి థెరపీ అవసరం. ఆర్థికపరమైన కట్టుబాట్లు లేకపోతే అక్కడ ఒక్క క్షణం కూడా ఉండటం వృథా' అని ఒక యూజర్ స్పందించారు. 'మీరు వెంటనే రాజీనామా చేయండి' అని మరో యూజర్ చెప్పారు. కార్పొరేట్ రంగంలో వర్క్ లైఫ్ బ్యాలెన్స్ గురించి చర్చ జరుగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇలాంటి నరకప్రాయమైన మేనేజ్‌మెంట్ సంస్కృతి ఇంకా కొనసాగుతూనే ఉందనడానికి ఈ ఘటనే నిదర్శనం. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని, ఆత్మగౌరవాన్ని పణంగా పెట్టి సాధించే విజయాలు ఏ కంపెనీకైనా శాశ్వతం కాదనే సత్యాన్ని సంస్థలు గ్రహించాలని కొందరు చెబుతున్నారు.

# మైక్రోసాఫ్ట్ కు భారీ నష్టం..

మైక్రోసాఫ్ట్ ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్నాలజీ కంపెనీలలో ఒకటి. అయితే.. ఇటీవల ఈ కంపెనీ షేర్లు భారీగా పడిపోవడం పెట్టుబడిదారులను ఆశ్చర్యానికి గురి చేసింది. జూన్ నెలలో మాత్రమే మైక్రోసాఫ్ట్ షేర్లు దాదాపు 17 శాతం పడిపోగా, కంపెనీ మార్కెట్ విలువలో 570 బిలియన్ డాలర్లకు (రూ.53.9 లక్షల కోట్లు) పైగా తగ్గుదల నమోదైంది. డిసెంబర్ 2000 తర్వాత సంస్థకు ఇదే అతిపెద్ద నెలవారీ క్షీణత కావడం గమనార్హం. కంపెనీకి ఈ పరిస్థితి రావడానికి ప్రధాన కారణం.. కృత్రిమ మేధస్సు (AI)పై మైక్రోసాఫ్ట్ పెడుతున్న భారీ పెట్టుబడులు. గత కొన్నేళ్లుగా సంస్థ డేటా సెంటర్లు, ఏఐ చిప్స్, క్లౌడ్ సర్వీసులు, అలాగే కోపైలెట్ వంటి ఏఐ ఉత్పత్తుల అభివృద్ధి కోసం బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. ఈ పెట్టుబడులు భవిష్యత్తులో మంచి ఫలితాలు ఇస్తాయని కంపెనీ నమ్ముతున్నప్పటికీ, పెట్టుబడిదారులు మాత్రం ఆ లాభాలు ఎప్పుడు వస్తాయనే విషయంలో ఆందోళన చెందుతున్నారు. ఇటీవల విడుదలైన త్రైమాసిక ఫలితాల్లో అజూర్ క్లౌడ్ సేవల వృద్ధి మార్కెట్ అంచనాల కంటే కొంత తక్కువగా ఉండడం కూడా పెట్టుబడిదారుల్లో నిరాశను కలిగించింది. అంతేకాకుండా.. రాబోయే నెలల్లో కూడా కంపెనీ భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తామని ప్రకటించింది. దీంతో ఖర్చులు పెరుగుతున్నా, లాభాలు మాత్రం అదే వేగంతో పెరగడం లేదనే భావన మార్కెట్‌లో ఏర్పడింది. ఏఐ అనేది మైక్రోసాఫ్ట్‌కు ఒక గొప్ప అవకాశం అయినప్పటికీ, అదే సమయంలో ఒక సవాలుగా కూడా మారింది. భవిష్యత్తులో ఏఐ కారణంగా సంప్రదాయ సాఫ్ట్‌వేర్‌లపై డిమాండ్ తగ్గే అవకాశం ఉందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ఏఐ రంగంలో ముందుండాలంటే కంపెనీ నిరంతరం భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఈ రెండు అంశాలు ప్రస్తుతం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL



# బయటపడిన అత్యంత పురాతన డైనోసార్ తోక!

## 'టైటానోసార్' రకానికి చెందినదిగా గుర్తింపు.. 40 ఏళ్ల పాటు ఎవరూ పట్టించుకోని వైనం



**న్యూయార్క్:** భూమిపై జీవించిన అత్యంత భారీ డైనోసార్ రకానికి చెందిన 'టైటానోసార్' శిలాజాన్ని శాస్త్రవేత్తలు అంటార్కిటికాలో కనుగొన్నారు. ఈ శిలాజాన్ని 1985లోనే బ్రిటీష్ అంటార్కిటిక్ సర్వే సభ్యులు, భూగర్భ శాస్త్రవేత్త మైక్ థామ్సన్ జేమ్స్ రాస్ ఐలాండ్‌లో సేకరించారు. అయితే అప్పట్లో ఇది ఏదో సముద్ర జీవికి చెందినదని భావించి, యూకేలోని ఒక సేకరణలో భాగంగా అల్మారాలో పడేసారు. 'ఆక్టా పలేయోంటోలాజికా పొలోనికా' జర్నల్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం ఇది డైనోసార్‌దేనని తేల్చింది. శిలాజ శాస్త్రవేత్త పలేయోంటోలాజిస్ట్ మార్క్ ఎవాన్స్ దీనిపై అనుమానంతో లండన్ సహచరుడు పాల్ బారెట్‌ను సంప్రదించగా, అది 82 మిలియన్ల సంవత్సరాల నాటి టైటానోసార్ తోక ఎముక (వర్టెబ్రా) అని స్పష్టమైంది. పది సెంటీమీటర్ల పొడవున్న ఈ ఎముకకు ఒక వైపు గుంత, మరోవైపు గుండ్రటి ఉబ్బెత్తు భాగం ఉన్నాయి. ఇది బాల్‌అండ్‌జాయింట్ సాకెట్ అమరికను సూచిస్తుందని, ఈ లక్షణం కేవలం ఈ రకమైన డైనోసార్లలోనే ప్రత్యేకంగా ఉంటుందని బారెట్ పేర్కొన్నారు. ఈ శిలాజం అసంపూర్తిగా ఉండటం వల్ల ఖచ్చితమైన జాతిని గుర్తించలేకపోయారు. కానీ ఇది కేవలం 23 అడుగుల పొడవు కలిగి, చిన్న వయసులోనే చనిపోయి సముద్రంలో మునిగి ఉంటుందని ప్రాథమిక విశ్లేషణలో తేలింది. మిలియన్ల సంవత్సరాల క్రితం అంటార్కిటికా ఖండం ప్రస్తుతం ఉన్నట్లు మంచుతో కాకుండా, అధిక కార్బన్ డయాక్సైడ్, తీవ్రమైన అగ్నిపర్వత చర్యల వల్ల డైనోసార్ల మనుగడకు అనుకూలమైన పచ్చని ప్రాంతంగా ఉండేది. కానీ కాలక్రమేణా ఇది గడ్డకట్టే మంచు ఖండంగా మారిపోయింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో 98 శాతం మేర మైళ్ల కొద్దీ మంచు పేరుకుపోవడంతో, ఇలాంటి పురాతన శిలాజాలను వెలికితీయడం పరిశోధకులకు అత్యంత కష్టతరంగా మారింది.

# గనిలో ఘోరం

## ఐదుగురు మృతి.. 15 మంది గల్లంతు

**విరిగిపడిన పాత మైనింగ్ వ్యర్థాల దిబ్బలు.. మట్టిలో కూరుకుపోయిన 20 మంది కూలీలు**



**హ్పాకాంత్:** ఉత్తర మయన్మార్‌లోని కచిన్ రాష్ట్రం, హ్పాకాంత్ ప్రాంతంలో భారీ వర్షాల కారణంగా ఒక పాత జేడ్ (పచ్చల) గని వ్యర్థాల కుప్ప ఒక్కసారిగా విరిగిపడింది. ఈ ఘోర ప్రమాదంలో ఐదుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, 15 మంది గల్లంతయ్యారు. ఆదివారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పలువురు కార్మికులు గని వ్యర్థాలలో విలువైన రత్నాల ముక్కలను వెతుకుతుండగా, ఈ విపత్తు సంభవించింది. భారీ వర్షాల కారణంగా ఈ మట్టి దిబ్బలు అస్తవ్యస్తంగా మారాయని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు 20 మంది కూలీలు మట్టి కింద కూరుకుపోయినట్లు సమాచారం. ప్రస్తుతం రెస్క్యూ టీమ్‌లు గల్లంతైన వారి కోసం సహాయక చర్యలు ముమ్మరం చేసి, తవ్వకాలు జరుపుతున్నాయి. మయన్మార్ మైనింగ్ రంగంలో ఇటువంటి భారీ ప్రమాదాలు రుతుపవనాల కాలంలో సర్వసాధారణంగా జరుగుతుంటాయి. ప్రమాదకరమైన రీతిలో గనులు తవ్వడం, వ్యర్థాలను పెద్ద ఎత్తున పేరుకుపోయేలా చేయడం వల్ల వర్షాలకు ఇవి కుప్పకూలి ఇక్కడి పేద కూలీల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి.

ప్రపంచంలోనే అత్యధికంగా జేడ్ లభించే ప్రాంతం ఉత్తర కచిన్ రాష్ట్రం. కాగా 2021లో ఆంగ్ సాన్ సూకీ నేతృత్వంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూలదోసి సైన్యం పగ్గాలు చేపట్టినప్పటి నుండి మయన్మార్ అంతర్యుద్ధంలో చిక్కుకుంది. ప్రస్తుతం ఈ జేడ్ గనుల ద్వారా వచ్చే ఆదాయం కోసం ఇటు దేశ సైన్యం, అటు ప్రతిపక్ష తిరుగుబాటు దళాలు తీవ్రంగా పోరాడుతున్నాయి. కొందరు కూలీలు ప్రాణాలను పణంగా పెట్టి ఇక్కడ జీవనం సాగిస్తున్నారు.

# ఇక అమెరికాతో చర్చల్లేవు..

## ఇరాన్ విదేశాంగ శాఖ



అమెరికా-ఇరాన్ చర్చలకు సంబంధించి ఇరాన్ మరోసారి సంచలన ప్రకటన చేసింది. ఇరుదేశాల మధ్య చర్చలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఖండించారు. మంగళవారం ఖతార్ రాజధాని దోహాలో ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష చర్చలు జరుగుతాయని ట్రంప్ చెప్పగా, తాము అమెరికా అధికారులతో చర్చలు జరపడానికి వెళ్లడం లేదని ఇరాన్ సోమవారం సాయంత్రం స్పష్టం చేసింది. ఈ చర్చల కోసం అధ్యక్షుడు ట్రంప్‌కు అత్యంత సన్నిహితులైన సలహాదారులు స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ సాంకేతిక చర్చలతో పాటు జరిగే ఉన్నత స్థాయి సమావేశాలకోసం దోహాకు వెళ్లనున్నారని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ప్రకటనపై ఇరాన్ స్పందించింది.

**ఇరాన్ స్పష్టీకరణ**

ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెం ఘరీబాబాదీ ఇరాన్ ప్రభుత్వ మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రతినిధి బృందం రాబోయే రెండు రోజులు దోహాలోనే ఉంటుందని, అయితే వారు అమెరికా అధికారులను కలవడానికి కాకుండా, ఖతార్ మధ్యవర్తుల ద్వారా అమెరికా తన కాల్పుల విరమణ ఒప్పంద బాధ్యతలను నెరవేర్చేలా చేయడానికి మాత్రమే వెళ్తున్నారని తెలిపారు. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ కూడా ఇదే విషయాన్ని ధృవీకరించారు.

**రూట్ ఫీజులపై ఒమన్‌తో చర్చలు**

హార్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణించే ఓడల మార్గాల్లో మార్పులు, ఫీజుల వసూలు వంటి కొత్త నిబంధనలపై ఒమన్‌తో చర్చలు జరుపుతున్నట్లు ఘరీబాబాదీ పేర్కొన్నారు. ఒకవేళ ఒమన్ కలిసి రాకపోయినా, ఇరాన్ ఒంటరిగానే ముందుకు వెళ్తుందని హెచ్చరించారు. గత రెండు వారాలుగా ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి, గత గురువారం నుండి ఇరు దేశాల మధ్య జరుగుతున్న దాడులు పెద్ద ముప్పుగా మారాయి. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో ఇరు దేశాలు దాడులు కొనసాగిస్తున్నాయి. అటు ఇజ్రాయెల్ సైన్యం కూడా ఆదివారం దక్షిణ లెబనాన్‌లోని మూడు హిజ్బుల్లా స్థావరాలపై దాడులు చేసింది. అమెరికా మద్దతుతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ నుండి వెనక్కి తగ్గాల్సి ఉన్నప్పటికీ, ఇరాన్ మద్దతు ఉన్న హిజ్బుల్లా గ్రూప్ ఈ ఒప్పందాన్ని తిరస్కరించడంతో అక్కడ కూడా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# రెస్టారెంట్‌లో రచ్చ రచ్చ చేసిన ఫ్యామిలీ



వియత్నాంలోని ఓ భారతీయ రెస్టారెంట్‌లో ఓ భారతీయ కుటుంబం ప్రవర్తించిన తీరు వివాదానికి దారితీసింది. హో చి మిన్ సిటీలో ఉన్న రెస్టారెంట్‌లో ఓ భారతీయ కుటుంబం పలు వస్తువులను ధ్వంసం చేసింది. రెస్టారెంట్ సిబ్బందిని బెదిరించింది. నగరంలోని డిస్ట్రిక్ట్ 1 పర్యాటక ప్రాంతంలో ఉన్న బాంబే బైట్స్ హెచ్‌సీఎమ్ అనే ప్రముఖ భారతీయ రెస్టారెంట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. భోజనం చేయడానికి వచ్చిన ఓ కుటుంబంలోని ఇద్దరు పిల్లలు వెళ్తున్న సమయంలో టిష్యూ పేపర్లను విసిరారు. ఆ పిల్లలు వాటిని విసరడం ఆపాలని సిబ్బంది కోరారు. దీంతో ఆ పిల్లల తల్లిదండ్రులకు రెస్టారెంట్‌పై కోపం వచ్చింది. రెస్టారెంట్ సిబ్బందికి సహకరించాల్సింది పోయి ఆ కుటుంబం వారితో ఘర్షణకు దిగింది. రెస్టారెంట్ యజమాని ఐశ్వర్య ఖన్నా సింగ్ మాట్లాడుతూ.. ఆస్తిని ధ్వంసం చేశారని, సిబ్బందిని మాటలతో దూషించారని, ఇన్‌ఫ్లుయెన్సర్లమని చెప్పి బెదిరించారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, పత్రాలు తమ వద్ద భద్రంగా ఉన్నాయని యాజమాన్యం తెలిపింది. "ఒక విషయం స్పష్టంగా చెబుతున్నాం. రెస్టారెంట్ పిల్లలు ఆడుకునే ప్రదేశం కాదు. ఇన్‌ఫ్లుయెన్సర్ హోదా ఉన్నంత మాత్రాన ఇటువంటివి తగవు. పౌర బాధ్యత అంటే పిల్లలకు జవాబుదారీతనం నేర్పించడం, ప్రజల ఆస్తిని గౌరవించడం, ప్రతి ఒక్కరూ సురక్షితంగా, ప్రశాంతంగా ఉండేందుకు నియమాలను పాటించడం. ఈ విలువలను పట్టించుకోకపోతే సిబ్బంది, ఇతర అతిథులు, వ్యాపారం అన్నీ ప్రభావితమవుతాయి" అని ఐశ్వర్య ఖన్నా సింగ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రెస్టారెంట్ అన్ని ప్రాంతాల నుంచి వచ్చే అతిథులను స్వాగతిస్తుందని, అయితే ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా ప్రవర్తించాలని స్పష్టం చేసింది. ఆస్తిని ధ్వంసం చేయడం, క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించడం, సిబ్బందిని బెదిరించడం సహించబోమని తెలిపింది. "అతిథి సత్కారం మా పని. కనీస మర్యాద ప్రతి ఒక్కరి బాధ్యత" అని తన ప్రకటనలో పేర్కొంది.

# ఐ విల్ ఫైండ్ యూ రివ్యూ : సూపర్ థ్రిల్లింగ్ సిరీస్




ప్రేమానుబంధమనేది మమతానురాగాలతో పెనువేసుకున్న ఓ చిక్కుబంధం. అందులోనూ రక్తసంబంధం అనేది మరింత జటిలమైనది. తామ రక్తసంబంధం ఏ సమయంలోనైనా సరే దూరమైతే ఆ బాధ వర్ణణాతీతం. మళ్ళీ దూరమైన వారితో కలిస్తేనే తమ జీవితానికి అర్థం అని అనుకునేవారెందరో. ఆ నేపధ్యంతోనే హాలీవుడ్ రచయిత హర్లాన్ కోబన్ రాసిన కథే ఐ విల్ ఫైండ్ యూ. ఇప్పుడీ కథను నెట్‌ఫ్లిక్స్ 8 ఎపిసోడ్ల సిరీస్ రూపంలో తీసుకువచ్చింది. కొడుకు హత్యారోపణను ఎదుర్కొంటున్న ఓ తండ్రి చనిపోయిన తన కొడుకును వెతుకుతూ సాగించిన పోరాటమే ఈ ఐ విల్ ఫైండ్ యూ సిరీస్. డేవిడ్ బరోస్ తన కొడుకు మాథ్యూ బరోస్ ను చంపిన కేసులో కౌంటీ జైలులో శిక్ష అనుభవిస్తూ ఉంటాడు. మాథ్యూ బరోస్ తల్లి ఛెరిల్ చెల్లెలైన రేచెల్ మిల్స్ తన బావ డేవిడ్ బరోస్ ను చూడడానికి జైలుకు వస్తుంది. ఆ సమయంలోనే రేచెల్ మాథ్యూ చనిపోలేదని ఓ ఫోటో డేవిడ్ కు చూపుతుంది. తన కొడుకు బ్రతికే ఉన్నాడన్న విషయం తెలుసుకున్న డేవిడ్, రేచెల్ సహాయంతో జైలు నుండి తప్పించుకుని మాథ్యూని వెతుకుతూ ఉంటాడు. ఈ ప్రయత్నంలోనే రేచెల్ బాయ్ ఫ్రెండ్ అయిన ఆడమ్ ఇంట్లో డేవిడ్, రేచెల్ తలదాచుకుంటారు. ఇక అక్కడి నుండి కథ అనూహ్యమైన మలుపులతో ఊహ కందని ట్విస్టులతో ఆసక్తిని రేకెత్తిస్తుంది. చనిపోయిన కొడుకు మాథ్యూ కేసులో నిందితుడైన డేవిడ్ మాథ్యూని రేచెల్ తో కనుక్కోగలడా లేదా అన్నది ఈ థ్రిల్లింగ్ సిరీస్ లోనే చూడాలి. 8 ఎపిసోడ్ల ఈ సిరీస్ ప్రతి ఎపిసోడ్ ఆద్యంతం చూస్తున్న ప్రేక్షకుల అంచనాలను పెంచేస్తూ థ్రిల్లింగ్ గా సాగుతుంది. ఎవరూ ఊహించని సస్పెన్స్ తో సాగే ఈ సిరీస్ థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే వాళ్ళకి సరైన ఛాయిస్.

# నెట్‌ఫ్లిక్స్ నే మోసం చేసిన డైరెక్టర్.. చివరికీ ఏమైందంటే?



ప్రముఖ హాలీవుడ్ డైరెక్టర్ కార్ల్ ఎరిక్ రించ్‌కు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఓ సిరీస్ తీసేందుకు నెట్‌ఫ్లిక్స్ నిధులను తన వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారని ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో దోషిగా తేలడంతో న్యాయస్థానం రెండున్నరేళ్ల జైలు శిక్ష ఖరారు చేసింది. అతను దాదాపు 11 మిలియన్ డాలర్ల మోసానికి పాల్పడినట్లు తెలుస్తోంది. డైరెక్టర్ కార్ల్ ఎరిక్ రిన్చ్ ఒక సైన్స్ ఫిక్షన్ సిరీస్ తీస్తానని నెట్‌ఫ్లిక్స్ నుంచి డబ్బులు తీసుకున్నారు. ఆ తర్వాత నెట్‌ఫ్లిక్స్ నిధులను తన వ్యక్తిగత అవసరాల కోసం కార్లు, క్రిప్టోకరెన్సీ, ఇతర విలాస వస్తువులను కొనుగోలు చేయడానికి ఉపయోగించుకున్నాడు. దీంతో అతనిపై నెట్‌ఫ్లిక్స్ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో దర్శకుడు దోషిగా తేలడంతో న్యాయస్థానం జైలు శిక్షతో పాటు 700 డాలర్ల జరిమానా విధించారు. కాగా.. డైరెక్టర్ కార్ల్ ఎరిక్ రిన్చ్ 2013లో వచ్చిన '47 రోనిన్' చిత్రంతో బాగా ఫేమస్ అయ్యారు.

# మ్యూజికల్ హారర్ కామెడీ.. ఓటీటీ స్ట్రీమింగ్‌కి రెడీ



ఈ వారం ఓటీటీల్లోకి పలు సినిమాలు రాబోతున్నాయి. వాటిలో మాలీవుడ్ టైమ్స్, అబ్సెషన్ చిత్రాలతో పాటు ఇసకపట్నం, సూపర్ సుబ్బు, మర్మదేశం, ముతస్సీ తదితర సిరీస్‌లు కూడా రాబోతున్నాయి. ఇప్పుడు వీటికి తోడుగా మలయాళ హారర్ కామెడీ మూవీ ఒకటి స్ట్రీమింగ్‌కి సిద్ధమైంది. ఈ మేరకు అధికారికంగా ప్రకటించారు. ఇంతకీ దీని సంగతేంటి? ఎందులో చూడొచ్చు? శ్రీనాథ్ బసి, ఫెమినా జార్జ్, సిద్ధార్థ్ భరతన్ ప్రధాన పాత్రలు చేసిన మలయాళ మ్యూజికల్ హారర్ కామెడీ సినిమా 'కరక్కం'. గత నెల 28న థియేటర్లలోకి వచ్చింది. ఓ మాదిరిగి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. అయితే ఇప్పుడు దీన్ని ఈ శుక్రవారం (జూలై 03) నుంచి సోనీ లివ్ ఓటీటీలో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తెలుగులోనూ అందుబాటులోకి రానుంది. 'కరక్కం' విషయానికొస్తే.. న్యూఇయర్ వేడుకల్లో భాగంగా ఇద్దరు స్నేహితులు ధనుష్(శ్రీనాథ్ భాసి), ఖాజా ఫుల్లుగా తాగి చర్చి స్మశానవాటికలో ఉన్న ఐదు శిలువలను పెకిలించి పారేస్తారు. ఆ తర్వాత వారిని ఐదు దెయ్యాలు వెంటాడటం మొదలుపెడతాయి. ఆ దెయ్యాల నుంచి వాళ్లు ఎలా తప్పించుకున్నారు? చివరకు ఏమైందనేదే మిగతా స్టోరీ.


# ఎన్టీఆర్ సినిమాపై తమిళ నెటిజన్లు ఆగ్రహం



సోషల్ మీడియాలో ఎప్పుడు ఎందుకు ఎవరిని ట్రోల్ చేసుకుంటారో అస్సలు అర్థం కాదు. రీసెంట్‌గా 'ఇడుపు కాయితం' అనే పదం వల్ల రెండు తెలుగు రాష్ట్రాల్లోని నెటిజన్లు ఒకరిపై ఒకరు ఎలా విమర్శలు చేసుకున్నారో చూస్తూనే ఉన్నాం. ఎవడో ఓ ఆకతాయి పెట్టిన కామెంట్ కారణంగా ఒకరి భాష, యాసపై మరొకరు ట్రోల్స్ చేసుకుంటున్నారు. ఇందులోకి రాజకీయాలు కూడా ఎంటరయ్యాయి. సరే ఈ గోల ఎప్పుడు ఆగుతుంది అనుకుంటే కొత్తది మొదలైంది. నిన్నటివరకు ఆంధ్రా vs తెలంగాణ నెటిజన్ల మధ్య రచ్చ నడవగా.. ఇప్పుడు తెలుగు vs తమిళ నెటిజన్ల మధ్య ట్రోల్స్ హంగామా నడుస్తోంది. దీనంతటికీ ఎన్టీఆర్‌త్రివిక్రమ్ సినిమా కొత్త పోస్టరే కారణం. చాన్నాళ్లుగా కుమారస్వామి కథతో తీసే సినిమాలో తారక్ నటిస్తాడనే రూమర్స్ వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు వాటిని నిజం చేస్తూ ప్రాజెక్టుని అధికారికంగా ప్రకటించారు. త్రిశూలం, డీఎన్ఏ, యుద్ధాలు తదితర అంశాలు ఈ పోస్టర్‌లో చూపించారు.

అయితే ఈ చిత్ర నిర్మాతలు నాగవంశీ, కల్యాణ్ రామ్.. పోస్టర్ షేర్ చేస్తూ 'ఉత్తరంలో జననం.. మధ్య భారతంలో తీర్చిదిద్దిన జీవితం.. దక్షిణాదిలో ఆరాధ్యుడిగా ఎదిగిన వ్యక్తిత్వం!' అని కుమారస్వామి గురించి పరోక్షంగా రాసుకొచ్చారు. దీంతో కుమారస్వామి తమ రాష్ట్రానికి చెందిన వాడని తమిళ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీంతో అసలు కుమారస్వామి ఎక్కడివాడు? అనే వింత చర్చ మొదలైంది. మరి ఇదెప్పుడు ఆగుతుందో ఏంటో?

# తెలుగు దర్శకుడితో డేటింగ్ రూమర్స్..




పవి టీచర్‌గా గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటి బ్రిగిడా సాగా.. సొంత భాషతో పాటు తెలుగులోనూ పలు సినిమాలు చేసింది. ప్రస్తుతం ఒకటి రెండు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈమె.. ఇప్పుడు తన ప్రేమ సంగతి బయటపెట్టింది. నటుడు ఆనంద్ రామ్‌తో రిలేషన్‌లో ఉన్న సంగతి సోషల్ మీడియాలో పంచుకుంది. తమిళ టీవీ సీరియల్ 'ఆహా కల్యాణం'లో పవి టీచర్‌గా తెగ వైరల అయిపోయిన బ్రిగిడా సాగా.. 2019లో తమిళం వచ్చిన 'అయోగ్య'తో సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చింది. తర్వాత మాస్టర్, ఇళవిన్ నిళల్, గరుడన్, మార్గన్, ఇడ్లీ కడై, హాట్‌స్పాట్ టూ మచ్ చిత్రాల్లో నటించింది. తెలుగులోనూ సింధూరం, పెదకాపు మూవీస్ చేసింది. ఇకపోతే ఈమె తెలుగు దర్శకుడు శ్రీకాంత్ అడ్డాలతో డేటింగ్ చేస్తుందనే రూమర్స్ కొన్నాళ్ల క్రితం వచ్చాయి. తర్వాత అంతా మర్చిపోయారు. అలాంటిది ఇప్పుడు బ్రిగిడా సాగా తన ప్రేమ విషయం రివీల్ చేసి ప్రియుడి గురించి చెప్పడంతో తోటీ నటీనటులు విషెస్ చెబుతున్నారు. ఆనంద్ రామ్.. హిప్ హాప్ ఆది హీరోగా చేసిన 'మీసయ్య మురుక్క' మూవీలో నటించాడు. మరో తమిళ చిత్రంలో హీరోగానూ చేశాడు. బ్రిగిడా సాగా తన ఇన్ స్టాలో ఆనంద్ గురించి చెబుతూ.. చిన్నప్పటి నుంచి అందమైన ప్రేమకథలు సినిమాల్లో ఉంటాయని అనుకునే దాన్ని, కానీ జీవితం నాకోసం మరో అందమైన కథ రాసింది. సినిమా ప్రయాణంలో నా లాంటి డ్రీమ్స్, ఇష్టాలు కలిగిన ఆనంద్ రామ్‌ని కలుసుకున్నాను. స్నేహంతో మొదలైన బంధం ఇప్పుడు ప్రేమవరకు వచ్చింది. అలానే మేం 'ఐ లవ్ యూ' చెప్పుకొనే జోడీ కాదు' అని బ్రిగిడా సాగా రాసుకొచ్చింది.

# విజయ్ ఖాళీ చేసిన స్థానంలో పోటీ?



కొరియోగ్రాఫర్, నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ ఎట్టకేలకు మౌనం వీడాడు. కొన్నిరోజుల క్రితం నుంచి ఇతడు రాజకీయాల్లోకి రానున్నాడని.. సీఎం విజయ్ ఖాళీ చేసిన తిరుచ్చి ఈస్ట్ స్థానంలో జరిగే ఉపఎన్నికల్లో నిలబడతాడనే రూమర్స్ చాలా వినిపించాయి. మూడు వారాల క్రితం దీని గురించి ప్రెస్ మీట్ పెట్టిన లారెన్స్.. చెప్పి చెప్పకుండానే మాట్లాడాడు. ఇప్పుడు ఎట్టకేలకు పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చేశాడు. రెండు వారాల క్రితం ఓ వీడియో పోస్ట్ చేసిన లారెన్స్.. నేను రాజకీయాల్లోకి రావడం పట్ల మీ సలహాలను కామెంట్స్‌లో పంచుకోండి. మీరు నో అని చెబితే నేను రాజకీయాల్లోకి రాను. సమాజానికి నా నిస్వార్థ సేవ కొనసాగిస్తా. మీరు ఎస్ అంటే మాత్రం వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. మీ అందరి ఆశీస్సులతో నేను ఈ ప్రయాణాన్ని ఎప్పుడు, ఎవరితో ప్రారంభించాలనుకుంటున్నానో వెల్లడిస్తా అని అన్నారు. తాజాగా మంగళవారం మధ్యాహ్నం దాదాపు 16 నిమిషాల వీడియో పోస్ట్ చేసిన లారెన్స్.. చాలా విషయాలు మాట్లాడాడు. నేను తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గం నుండి పోటీ చేయను. కానీ రాజకీయాల్లోకి రానని మాత్రం అనుకోవద్దు అని చెప్పాడు. దీంతో విజయ్ ఖాళీ చేసిన స్థానంలో పోటీ చేస్తాడని ఆశపడ్డ అభిమానులకు నిరాశ ఎదురైంది. అయితే లారెన్స్ ఊపు చూసి పక్కాగా పొలిటికల్ ఎంట్రీ ఇస్తాడని భావించారు. మరి ఏమైందో ఏమో గానీ సడన్ యూటర్న్ తీసుకుని అందరికీ షాకిచ్చాడు.

# ప్రాంతీయ భాష నుంచి పాన్ ఇండియా వరకు



కృషి, శ్రమ, పట్టుదల విజయానికి మూలాలు. ఆ తర్వాత అదృష్టం తోడవ్వాలి. ఇవన్నీ పుష్కలంగా ఉన్న అతికొద్దిమంది హీరోయిన్లలో రష్మిక పేరు కచ్చితంగా ఉంటుంది. ఎందుకంటే సరిగ్గా పదేళ్ల క్రితం 'కిరిక్ పార్టీ' అనే కన్నడ మూవీతో నటిగా పరిచయమైంది. అలాంటి ఈమె.. పాన్ ఇండియా హీరోయిన్ అవుతానని కలలో కూడా ఊహించి ఉండదు. కానీ అవ్వడంతో పాటు మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. హీరోయిన్‌గా తొలి సినిమాతో గుర్తింపు వచ్చిన కొన్నాళ్లకు 'ఛలో' అంటూ రష్మిక తెలుగులోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రం మంచి పేరుతో పాటు అద్భుతమైన అవకాశాల్ని తెచ్చిపెట్టింది. అనంతరం తెలుగులోనే 'గీతగోవిందం' మూవీ ఈమె లైఫ్, కెరీర్ రెండింటిని మార్చేసిందని చెప్పొచ్చు. ఎందుకంటే ఇందులో హీరోగా నటించిన విజయ్ దేవరకొండ ఇప్పుడు ఈమె భర్త అయ్యాడు. ఇది బ్లాక్‌బస్టర్ సక్సెస్ కావడంతో మహేశ్ బాబు, అల్లు అర్జున్ లాంటి స్టార్ హీరోల సరసన అవకాశాలు వచ్చాయి. తెలుగులో మంచి సక్సెస్ కారణంగా బాలీవుడ్‌లోనూ రష్మికకు వరస ఛాన్సుల వచ్చాయి. యానిమల్, ఛావా చిత్రాలు ఈమెని పాన్ ఇండియా స్థాయిలో ఓ రేంజికి తీసుకెళ్లిపోయాయి.

ఈ ఏడాది ప్రారంభంలో విజయ్ దేవరకొండని పెళ్లి చేసుకున్న రష్మిక.. ఓవైపు సినిమాలు చేస్తూ మరోవైపు ఫిట్‌నెస్ కాపాడుకుంటూ ఫుల్ బిజీగా ఉంది. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూనే ఉంటుంది. రీసెంట్ టైంలో ఈమె చేసిన 'కాక్‌టెయిల్ 2' థియేటర్లలోకి వచ్చింది. ఈ ఏడాదిలోనే భర్తతో చేసిన రణబాలి, లీడ్ రోల్ చేసిన ఫిమేల్ ఓరియెంటెడ్ మూవీ 'మైసా' రిలీజ్ కానున్నాయి. ఇదంతా చూస్తుంటే పదేళ్లలో రష్మిక జీవితం ఎంతలా మారిపోయిందో కదా!



# రాజకీయాల్లోకి హీరో సూర్య?

నటుడు సూర్య స్టార్ హీరోగా రాణిస్తూ తన అగరం ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈయన కూడా హీరో విజయ్, ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రిలా రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి బలాన్నిచ్చేలా ఆదివారం చెన్నైలో జరిగిన సూర్య అఖిల ఇండియా అభిమానుల పరిరక్షణ సంఘం నిర్వహించిన రాష్ట్ర జిల్లా స్థాయి చర్చా సమావేశంలో ఆర్.వీరమణి.. నటుడు సూర్య రాజకీయ ప్రవేశం తథ్యం అని అన్నారు. సూర్య పొలిటికల్ ఎంట్రీ గురించి సోషల్ మీడియాలోనూ వైరల్ అయింది. దీంతో అఖిల భారత సూర్య అభిమానుల పరిరక్షణ సంఘం నిర్వహకులు స్పందించారు. ఆర్. వీరమణి చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిగతమని, నటుడు సూర్యకు రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. సూర్య కెరీర్ విషయానికొస్తే.. గత కొన్నేళ్లుగా సినిమాలు చేస్తున్నప్పటికీ సరైన సక్సెస్ లేదు. గత నెలలో విడుదలైన 'వీరభద్రుడు' మూవీ తెలుగులో ఫ్లాప్ అయినప్పటికీ తమిళంలో మాత్రం అద్భుతమైన హిట్ అయింది. రూ.300 కోట్లకు పైగా కలెక్షన్స్ సొంతం చేసుకుంది. ఆగస్టులో 'విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీతో రాబోతున్న సూర్య.. మరోవైపు దర్శకుడు జీతూ మాధవన్ తీస్తున్న ఓ మూవీలో పోలీస్‌గా చేస్తున్నారు. నిన్ననే 'సలార్' నిర్మాతలతో కలిసి కొత్త ప్రాజెక్ట్ ప్రకటించారు. కెరీర్ పరంగా ఇంత బిజీగా ఉన్నప్పుడు ప్రాక్టికల్‌గా చూసుకున్న సూర్య.. రాజకీయాల్లోకి రావడం అనేది అసాధ్యం.

# ఇలాంటి చాన్స్ అరుదుగా వస్తుంది: నభా నటేష్



''నాగబంధం, స్వయంభు' వంటి పాన్ ఇండియా చిత్రాల్లో ఒకే సమయంలో నటించడం ఆనందంగా ఉంది. ఈ రెండు సినిమాలు వేటికవే ప్రత్యేకమైనవి. ఈ చిత్రాలు ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు చూడదగ్గవే. ఇలాంటి బిగ్ మూవీస్‌లో నటించడం నాకు చాలా సంతృప్తిగా ఉంది'' అని నభా నటేష్ చెప్పారు. విరాట్ కర్ణ హీరోగా, నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'నాగబంధం–ది సీక్రెట్ ట్రెజర్'. కిషోర్ అన్నపురెడ్డి, నిశిత నాగిరెడ్డి నిర్మించిన ఈ మూవీ జూలై 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా నభా నటేష్ మాట్లాడుతూ– ''నాగబంధం'లో నేను పార్వతి అనే వేద విద్యార్థిని పాత్రలో కనిపిస్తాను. కుటుంబం కోసం, ప్రేమ కోసం ఎంతవరకైనా నిలబడే వ్యక్తిత్వం ఆమెది. పార్వతి తీసుకునే ప్రతి నిర్ణయం కథపై ప్రభావం చూపుతుంది. నా పాత్ర కోసం రెడీ అవడానికి దాదాపు రెండు గంటలు పట్టేది. ఇలాంటి సినిమాల్లో నటించే చాన్స్ చాలా అరుదుగా వస్తుంది. ఈ సినిమా కోసం వేసిన అనంత పద్మనాభస్వామి ఆలయ సెట్‌లో షూటింగ్ చేస్తున్నప్పుడు మేం చాలా నియమ నిష్టలతో పని చేశాం. పూర్తిగా శాకాహారులుగా ఉన్నాం. 'నమోరే..' పాటను దాదాపు 5,000 మంది డ్యాన్సర్లతో గణేష్ ఆచార్య మాస్టర్ తెరకెక్కించారు. ఈ పాట స్క్రీన్‌పై చాలా బాగుంటుంది. అభిషేక్ నామాగారు 'నాగబంధం'ని అద్భుతంగా తెరకెక్కించారు'' అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com